Follow: @ANNTELUGU

ANN తెలుగు

21-03-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 109 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ప్రపంచం చూపు.. తెలంగాణ వైపు

### ఈ సమ్మర్ మనదే

తెలంగాణ సర్కార్ అదిరిపోయే టూరిజం ప్లానింగ్

**మహా :** మిస్ వరల్డ్ పోటీలతో తెలంగాణ బ్రాండ్ ప్రపంచంలో మార్మోగనుంది. 140 దేశాల అందగత్తెలు.. ఇది కవర్ చేసేందుకు వచ్చే 3వేల మందికి పైగా విదేశీ మీడియా ప్రతినిధుల రాకతో హైదరాబాద్ టూరిజం.. హైదరాబాద్ ప్రభుత్వ ఖ్యాతి నెక్స్ట్ లెవెల్ కు వెళ్ళనుంది. మిస్ వరల్డ్ 2025 పోటీలు మే 7 వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో దాదాపు 140 దేశాలకు చెందిన వారు పాల్గొననున్నారు.

04


**టాప్ న్యూస్**



### తెలుగు సినిమాల్లో అసభ్యకరమైన డ్యాన్స్ స్టెప్స్

- ఇండ్రస్ట్రీపై తెలంగాణ మహిళా కమిషన్ సీరియస్..!
- పద్ధతి మార్చుకోవాలని హెచ్చరిక
- అసభ్యకర డ్యాన్స్ స్టెప్పులపై ఫైర్


03



### అరుదైన గౌరవాన్ని అందుకున్న చిరు

- యూకే పార్లమెంటులో చిరంజీవికి అపురూప సన్మానం
- లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు అందించిన బ్రిడ్జ్ ఇండియా గ్రూప్
- సోషల్ మీడియాలో చిరంజీవి పోస్టు

02



### గుడ్ కీపిటప్

- ఎమ్మెల్సీ గెలుపుపై రాష్ట్ర నేతలను అభినందించిన అమిత్ షా
- స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటాలన్న కేంద్ర హోం మంత్రి
- బీజేపీ రాష్ట్ర కీలక నేతలతో భేటీ అయిన షా

03



**65 రోజులు**

**74 మ్యాచ్‌లు**

## రేపటి నుండే ఐపీఎల్-2025

### ఈడెన్‌లో ఓ ధనాధన్ ఓపెనింగ్

2 నెలల పాటు క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించే పండుగ

క్రికెట్ అభిమానులను రెండు నెలల పాటు ఉర్రూతలూగించేందుకు ఐపీఎల్-2025 రెడీ అయింది. మార్చి 22 నుంచి మే 25 వరకు 65 రోజుల పాటు జరుగుతుంది. ఈ టోర్నీలో మొత్తం 74 మ్యాచ్‌లు జరుగుతాయి. టోర్నీ ప్రారంభమయ్యే మార్చి 22న కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడబోతున్నాయి 18వ సీజన్‌లోకి అడుగుపెట్టిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రపంచంలోనే అత్యంత లాభదాయకమైన ఫ్రాంచైజ్ ఆధారిత టీ20 క్రికెట్ టోర్నమెంట్. మార్చి 22, శనివారం కోల్‌కతాలోని ఐకానిక్ ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లతో ఆతిథ్యం ఇవ్వడంతో ఐపీఎల్ 2025 షెడ్యూల్ ప్రారంభమవుతుంది. ఐపీఎల్ 2025 మ్యాచ్‌ల జాబితాలో తదుపరిది సన్ రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్. ఆదివారం మధ్యాహ్నం జరిగే మ్యాచ్ మార్చి 23న ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతుంది. - మహా, ప్రత్యేకం

02



### ఐపీఎల్ 2025 జట్లు & గ్రూపులు

**గ్రూప్ ఎ:**

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్ కే), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ ఆర్), పంజాబ్ కింగ్స్ (పిబికెఎస్), కోల్‌కతా నైట్ రైడర్స్ (కెకెఆర్)

**గ్రూప్ బి :**

ముంబై ఇండియన్స్ (ఎంఐ), గుజరాత్ టైటాన్స్ (జీటీ), ఢిల్లీ క్యాపిటల్స్ (డిసి), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ ఆర్ హెచ్), లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ ఎస్ జి)

మహా స్పెషల్ MAHAA Special



## మేం ఆదేశిస్తే పోలీసులు కేటీఆర్‌ను వంగబెట్టి దంచరా?

### మేం 10 నెలల్లో చేశాం మీరు 10 ఏళ్లలో ఎందుకు చేయలేదు



- నిరుద్యోగుల ఉసురు కేసీఆర్‌కు తగిలింది
- బాధ్యతలు విస్మరించి పాలించిన బీఆర్ఎస్
- కేసీఆర్ కుటుంబంలోని వారికి ఉద్యోగాలిచ్చారు
- నిరుద్యోగులకు మొండిచేయి చూపారు
- నెల రోజుల్లోనే గ్రూప్ 2, 3 ఉద్యోగాలు.. నాపై ప్రజలకెందుకు కోపం
- కొలువుల జాతరలో మండిపడ్డ సీఎం రేవంత్

**మహా :** పదేళ్ళ బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగ నోటిఫికేషన్లు తప్ప ఉద్యోగాలు ఇచ్చింది లేదని, కాంగ్రెస్ 10 నెలల పాలనలో ఉద్యోగ జాతరలు నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం రవీంద్ర భారతిలో కొలువుల పండుగ కార్యక్రమం జరిగింది. కారుణ్య నియామకాలు పొందిన వారికి అపాయింట్ ఆర్డర్ లు

మిగతా 2లో



### 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 2650 కేంద్రాలలో పరీక్ష రాయనున్న 5,09,403 విద్యార్థులు
- అధికారిక వెబ్ సైట్ లో హాల్ టికెట్లు

02



### భర్తను ముక్కలుగా నరికి హత్య చేసిన భార్య

- 15 ముక్కలుగా చేసి డ్రమ్ములో పెట్టి పూడ్చిపెట్టిన దుర్మార్గురాలు
- ప్రేమికుడితో కలిసి ఘాతుకానికి పాల్పడ్డ యువతి
- వివాహేతర సంబంధమే కారణమన్న పోలీసులు

03

## వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తా

### బీఆర్ఎస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తా

వరంగల్ సభకు కదం తొక్కాలి.. సూర్యాపేటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**సూర్యాపేట, మహా :** వచ్చే ఏడాది తాను పాదయాత్ర చేయనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సూర్యాపేటలో గురువారం పార్టీ కార్యకర్తలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. బీఆర్ఎస్ ను మళ్లీ అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పాదయాత్ర ఉంటుందన్నారు. పాదయాత్ర కోసం ప్రస్తుతం కసరత్తులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం జిల్లా పర్యటనలు ప్రారంభమయ్యాయన్నారు. ఏడాది చివర వరకు పార్టీని బలోపేతం చేసే పనిపై ఫోకస్ పెట్టినట్లు తెలిపారు.

మిగతా 2లో



### ఇల్లీగల్ సంస్థకు ప్రచారకర్తగా లేరు

విజయ్ దేవరకొండ పీఆర్ టీం


08

### అవును ఆ యాడ్ చేశా

తర్వాత తప్పు తెలుసుకున్నా

బెట్టింగ్ యాప్ వ్యవహారంపై ప్రకాశ్‌రాజ్

03



### శివజ్యోతిపై నెటిజన్ల శివాలు

ఈవిడ ఎలా మిస్ అయింది? అరెస్టుకు రంగం సిద్ధం!

03



### హనీ ట్రాప్‌లో ఇరుక్కున్న 48 మంది కర్ణాటక ఎమ్మెల్యేలు

ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించిన ప్రభుత్వం

అసెంబ్లీలో దుమారం

03



# 65 రోజులు.. 74 మ్యాచ్‌లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి జట్టు తమ గ్రూపులోని ఇతరులతో రెండుసార్లు, మరో గ్రూపులోని ఒక జట్టుతో రెండుసార్లు, మిగిలిన నాలుగు జట్లతో ఒకసారి లీగ్ దశలో తలపడుతుంది. లీగ్ దశలు మే 18న ముగుస్తాయి. మొదటి నాలుగు జట్లు ప్లేఆఫ్‌లకు అర్హత సాధిస్తాయి, మొదటి రెండు జట్లు మే 20న హైదరాబాద్‌లో జరిగే క్వాలిఫయర్ 1లో తలపడతాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు మే 25న కోల్‌కతాలో జరిగే ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. ఇంతలో, లీగ్ దశలో మూడు మరియు నాల్గవ స్థానంలో నిలిచిన జట్లు ఎలిమినేటర్ 1లో ఆడతాయి, ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు క్వాలిఫైయర్ 2లో క్వాలిఫైయర్ 1లో ఓడిన జట్టుతో తలపడి ఫైనల్‌లో రెండవ జట్టును నిర్ణయిస్తుంది. మొత్తం మీద, 13 వేదికల్లో ఐపీఎల్ 2025 కోసం 74 మ్యాచ్‌లు షెడ్యూల్ చేయబడ్డాయి. 10 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా ఈడెన్ గార్డెన్స్ IPL ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. మూడు జట్లు తమ సొంత మ్యాచ్‌లను రెండు వేర్వేరు వేదికలలో ఆడతాయి ఢిల్లీ క్యాపిటల్స్ (విశాఖపట్నం మరియు న్యూఢిల్లీ), పంజాబ్ కింగ్స్ (చండీగఢ్ మరియు ధర్మశాల) మరియు రాజస్థాన్ రాయల్స్ (గువహతి మరియు జైపూర్). ఐపీఎల్ 2025 షెడ్యూల్‌లో 12 డబుల్ హెడర్‌లు ఉన్నాయి, మధ్యాహ్నం మ్యాచ్‌లు మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రారంభమవుతాయి. సాయంత్రం మ్యాచ్‌లు రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతాయి.

## పూర్తి షెడ్యూల్ ఇదే...

మార్చి 22, 2025 (శనివారం), రాత్రి 7:30 – కోల్‌కతా నైట్ రైడర్స్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (కోల్‌కతా)
మార్చి 23, 2025 (ఆదివారం), మధ్యాహ్నం 3:30 – సన్‌రైజర్స్ హైదరాబాద్ vs రాజస్థాన్ రాయల్స్ (హైదరాబాద్)
మార్చి 23, 2025 (ఆదివారం), రాత్రి 7:30 – చెన్నై సూపర్ కింగ్స్ vs ముంబై ఇండియన్స్ (చెన్నై)
మార్చి 24, 2025 (సోమవారం), రాత్రి 7:30 గంటలకు – ఢిల్లీ క్యాపిటల్స్ vs లక్నో సూపర్ జెయింట్స్ (విశాఖపట్నం)
మార్చి 25, 2025 (మంగళవారం), రాత్రి 7:30 – గుజరాత్ టైటాన్స్ vs పంజాబ్ కింగ్స్ (అహ్మదాబాద్)
మార్చి 26, 2025 (బుధవారం), రాత్రి 7:30 గంటలకు – రాజస్థాన్ రాయల్స్ vs కోల్‌కతా నైట్ రైడర్స్ (గువహతి)
మార్చి 27, 2025 (గురువారం), రాత్రి 7:30 – సన్‌రైజర్స్ హైదరాబాద్ vs లక్నో సూపర్ జెయింట్స్ (హైదరాబాద్)
మార్చి 28, 2025 (శుక్రవారం), రాత్రి 7:30 – చెన్నై సూపర్ కింగ్స్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (చెన్నై)
మార్చి 29, 2025 (శనివారం), రాత్రి 7:30 – గుజరాత్ టైటాన్స్ vs ముంబై ఇండియన్స్ (అహ్మదాబాద్)
మార్చి 30, 2025 (ఆదివారం), మధ్యాహ్నం 3:30 – ఢిల్లీ క్యాపిటల్స్ vs సన్‌రైజర్స్ హైదరాబాద్ (విశాఖపట్నం)
మార్చి 30, 2025 (ఆదివారం), రాత్రి 7:30 – రాజస్థాన్ రాయల్స్ vs చెన్నై సూపర్ కింగ్స్ (గౌహతి)
మార్చి 31, 2025 (సోమవారం), రాత్రి 7:30 – ముంబై ఇండియన్స్ vs కోల్‌కతా నైట్ రైడర్స్ (ముంబై)
ఏప్రిల్ 1, 2025 (మంగళవారం), రాత్రి 7:30 – లక్నో సూపర్ జెయింట్స్ vs పంజాబ్ కింగ్స్ (లక్నో)
ఏప్రిల్ 2, 2025 (బుధవారం), రాత్రి 7:30 – రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు vs గుజరాత్ టైటాన్స్ (బెంగళూరు)
ఏప్రిల్ 3, 2025 (గురువారం), రాత్రి 7:30 – కోల్‌కతా నైట్ రైడర్స్ vs సన్‌రైజర్స్ హైదరాబాద్ (కోల్‌కతా)
ఏప్రిల్ 4, 2025 (శుక్రవారం), రాత్రి 7:30 – లక్నో సూపర్ జెయింట్స్ vs ముంబై ఇండియన్స్ (లక్నో)
ఏప్రిల్ 5, 2025 (శనివారం), మధ్యాహ్నం 3:30 – చెన్నై సూపర్ కింగ్స్ vs ఢిల్లీ క్యాపిటల్స్ (చెన్నై)
ఏప్రిల్ 5, 2025 (శనివారం), రాత్రి 7:30 – పంజాబ్ కింగ్స్ vs రాజస్థాన్ రాయల్స్ (న్యూ చండీగఢ్)
ఏప్రిల్ 6, 2025 (ఆదివారం), మధ్యాహ్నం 3:30 – కోల్‌కతా నైట్ రైడర్స్ vs లక్నో సూపర్ జెయింట్స్ (కోల్‌కతా)
ఏప్రిల్ 6, 2025 (ఆదివారం), రాత్రి 7:30 – సన్‌రైజర్స్ హైదరాబాద్ vs గుజరాత్ టైటాన్స్ (హైదరాబాద్)
ఏప్రిల్ 7, 2025 (సోమవారం), రాత్రి 7:30 – ముంబై ఇండియన్స్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ముంబై)
ఏప్రిల్ 8, 2025 (మంగళవారం), రాత్రి 7:30 – పంజాబ్ కింగ్స్ vs చెన్నై సూపర్ కింగ్స్ (న్యూ చండీగఢ్)
ఏప్రిల్ 9, 2025 (బుధవారం), రాత్రి 7:30 – గుజరాత్ టైటాన్స్ vs రాజస్థాన్ రాయల్స్ (అహ్మదాబాద్)
ఏప్రిల్ 10, 2025 (గురువారం), రాత్రి 7:30 – రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు vs ఢిల్లీ క్యాపిటల్స్ (బెంగళూరు)
ఏప్రిల్ 11, 2025 (శుక్రవారం), రాత్రి 7:30 – చెన్నై సూపర్ కింగ్స్ vs కోల్‌కతా నైట్ రైడర్స్ (చెన్నై)
ఏప్రిల్ 12, 2025 (శనివారం), మధ్యాహ్నం 3:30 – లక్నో సూపర్ జెయింట్స్ vs గుజరాత్ టైటాన్స్ (లక్నో)
ఏప్రిల్ 12, 2025 (శనివారం), రాత్రి 7:30 – సన్‌రైజర్స్ హైదరాబాద్ vs పంజాబ్ కింగ్స్ (హైదరాబాద్)
ఏప్రిల్ 13, 2025 (ఆదివారం), మధ్యాహ్నం 3:30 – రాజస్థాన్ రాయల్స్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (జైపూర్)
ఏప్రిల్ 13, 2025 (ఆదివారం), రాత్రి 7:30 – ఢిల్లీ క్యాపిటల్స్ vs ముంబై ఇండియన్స్ (ఢిల్లీ)
ఏప్రిల్ 14, 2025 (సోమవారం), రాత్రి 7:30 – లక్నో సూపర్ జెయింట్స్ vs చెన్నై సూపర్ కింగ్స్ (లక్నో)
ఏప్రిల్ 15, 2025 (మంగళవారం), రాత్రి 7:30 – పంజాబ్ కింగ్స్ vs కోల్‌కతా నైట్ రైడర్స్ (న్యూ చండీగఢ్)
ఏప్రిల్ 16, 2025 (బుధవారం), రాత్రి 7:30 – ఢిల్లీ క్యాపిటల్స్ vs రాజస్థాన్ రాయల్స్ (ఢిల్లీ)
ఏప్రిల్ 17, 2025 (గురువారం), రాత్రి 7:30 – ముంబై ఇండియన్స్ vs సన్‌రైజర్స్ హైదరాబాద్ (ముంబై)
ఏప్రిల్ 18, 2025 (శుక్రవారం), రాత్రి 7:30 – రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు vs పంజాబ్ కింగ్స్ (బెంగళూరు)
ఏప్రిల్ 19, 2025 (శనివారం), మధ్యాహ్నం 3:30 – గుజరాత్ టైటాన్స్ vs ఢిల్లీ క్యాపిటల్స్ (అహ్మదాబాద్)
ఏప్రిల్ 19, 2025 (శనివారం), రాత్రి 7:30 – రాజస్థాన్ రాయల్స్ vs లక్నో సూపర్ జెయింట్స్ (జైపూర్)
ఏప్రిల్ 20, 2025 (ఆదివారం), మధ్యాహ్నం 3:30 – పంజాబ్ కింగ్స్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (న్యూ చండీగఢ్)
ఏప్రిల్ 20, 2025 (ఆదివారం), రాత్రి 7:30 – ముంబై ఇండియన్స్ vs చెన్నై సూపర్ కింగ్స్ (ముంబై)
ఏప్రిల్ 21, 2025 (సోమవారం), రాత్రి 7:30 – కోల్‌కతా నైట్ రైడర్స్ vs గుజరాత్ టైటాన్స్ (కోల్‌కతా)
ఏప్రిల్ 22, 2025 (మంగళవారం), రాత్రి 7:30 – లక్నో సూపర్ జెయింట్స్ vs ఢిల్లీ క్యాపిటల్స్ (లక్నో)
ఏప్రిల్ 23, 2025 (బుధవారం), రాత్రి 7:30 – సన్‌రైజర్స్ హైదరాబాద్ vs ముంబై ఇండియన్స్ (హైదరాబాద్)
ఏప్రిల్ 24, 2025 (గురువారం), రాత్రి 7:30 – రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు vs రాజస్థాన్ రాయల్స్ (బెంగళూరు)
ఏప్రిల్ 25, 2025 (శుక్రవారం), రాత్రి 7:30 – చెన్నై సూపర్ కింగ్స్ vs సన్‌రైజర్స్ హైదరాబాద్ (చెన్నై)
ఏప్రిల్ 26, 2025 (శనివారం), రాత్రి 7:30 – కోల్‌కతా నైట్ రైడర్స్ vs పంజాబ్ కింగ్స్ (కోల్‌కతా)
ఏప్రిల్ 27, 2025 (ఆదివారం), మధ్యాహ్నం 3:30 – ముంబై ఇండియన్స్ vs లక్నో సూపర్ జెయింట్స్ (ముంబై)
ఏప్రిల్ 27, 2025 (ఆదివారం), రాత్రి 7:30 – ఢిల్లీ క్యాపిటల్స్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఢిల్లీ)
ఏప్రిల్ 28, 2025 (సోమవారం), రాత్రి 7:30 – రాజస్థాన్ రాయల్స్ vs గుజరాత్ టైటాన్స్ (జైపూర్)
ఏప్రిల్ 29, 2025 (మంగళవారం), రాత్రి 7:30 – ఢిల్లీ క్యాపిటల్స్ vs కోల్‌కతా నైట్ రైడర్స్ (ఢిల్లీ)
ఏప్రిల్ 30, 2025 (బుధవారం), రాత్రి 7:30 – చెన్నై సూపర్ కింగ్స్ vs పంజాబ్ కింగ్స్ (చెన్నై)
మే 1, 2025 (గురువారం), రాత్రి 7:30 – రాజస్థాన్ రాయల్స్ vs ముంబై ఇండియన్స్ (జైపూర్)
మే 2, 2025 (శుక్రవారం), రాత్రి 7:30 – గుజరాత్ టైటాన్స్ vs సన్‌రైజర్స్ హైదరాబాద్ (అహ్మదాబాద్)
మే 3, 2025 (శనివారం), రాత్రి 7:30 – రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు vs చెన్నై సూపర్ కింగ్స్ (బెంగళూరు)
మే 4, 2025 (ఆదివారం), మధ్యాహ్నం 3:30 – కోల్‌కతా నైట్ రైడర్స్ vs రాజస్థాన్ రాయల్స్ (కోల్‌కతా)
మే 4, 2025 (ఆదివారం), రాత్రి 7:30 – పంజాబ్ కింగ్స్ vs లక్నో సూపర్ జెయింట్స్ (ధర్మశాల)
మే 5, 2025 (సోమవారం), రాత్రి 7:30 – సన్‌రైజర్స్ హైదరాబాద్ vs ఢిల్లీ క్యాపిటల్స్ (హైదరాబాద్)
మే 6, 2025 (మంగళవారం), రాత్రి 7:30 – ముంబై ఇండియన్స్ vs గుజరాత్ టైటాన్స్ (ముంబై)
మే 7, 2025 (బుధవారం), రాత్రి 7:30 గంటలకు – కోల్‌కతా నైట్ రైడర్స్ vs చెన్నై సూపర్ కింగ్స్ (కోల్‌కతా)
మే 8, 2025 (గురువారం), రాత్రి 7:30 – పంజాబ్ కింగ్స్ vs ఢిల్లీ క్యాపిటల్స్ (ధర్మశాల)
మే 9, 2025 (శుక్రవారం), రాత్రి 7:30 – లక్నో సూపర్ జెయింట్స్ vs రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (లక్నో)
మే 10, 2025 (శనివారం), రాత్రి 7:30 – సన్‌రైజర్స్ హైదరాబాద్ vs కోల్‌కతా నైట్ రైడర్స్ (హైదరాబాద్)
మే 11, 2025 (ఆదివారం), మధ్యాహ్నం 3:30 – పంజాబ్ కింగ్స్ vs ముంబై ఇండియన్స్ (ధర్మశాల)
మే 11, 2025 (ఆదివారం), రాత్రి 7:30 గంటలకు – ఢిల్లీ క్యాపిటల్స్ vs గుజరాత్ టైటాన్స్ (ఢిల్లీ)
మే 12, 2025 (సోమవారం), రాత్రి 7:30 – చెన్నై సూపర్ కింగ్స్ vs రాజస్థాన్ రాయల్స్ (చెన్నై)
మే 13, 2025 (మంగళవారం), రాత్రి 7:30 – రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు vs సన్‌రైజర్స్ హైదరాబాద్ (బెంగళూరు)
మే 14, 2025 (బుధవారం), రాత్రి 7:30 – గుజరాత్ టైటాన్స్ vs లక్నో సూపర్ జెయింట్స్ (అహ్మదాబాద్)
మే 15, 2025 (గురువారం), రాత్రి 7:30 – ముంబై ఇండియన్స్ vs ఢిల్లీ క్యాపిటల్స్ (ముంబై)
మే 16, 2025 (శుక్రవారం), రాత్రి 7:30 – రాజస్థాన్ రాయల్స్ vs పంజాబ్ కింగ్స్ (జైపూర్)
మే 17, 2025 (శనివారం), రాత్రి 7:30 – రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు vs కోల్‌కతా నైట్ రైడర్స్ (బెంగళూరు)
మే 18, 2025 (ఆదివారం), మధ్యాహ్నం 3:30 – గుజరాత్ టైటాన్స్ vs చెన్నై సూపర్ కింగ్స్ (అహ్మదాబాద్)
మే 18, 2025 (ఆదివారం), రాత్రి 7:30 – లక్నో సూపర్ జెయింట్స్ vs సన్‌రైజర్స్ హైదరాబాద్ (లక్నో)
మే 20, 2025 (మంగళవారం), రాత్రి 7:30 – క్వాలిఫైయర్ 1 (హైదరాబాద్)
మే 21, 2025 (బుధవారం), రాత్రి 7:30 గంటలకు – ఎలిమినేటర్ (హైదరాబాద్)
మే 23, 2025 (శుక్రవారం), రాత్రి 7:30 – క్వాలిఫైయర్ 2 (కోల్‌కతా)
మే 25, 2025 (ఆదివారం), రాత్రి 7:30 గంటలకు – ఫైనల్ (కోల్‌కతా)

# మేం ఆదేశిస్తే పోలీసులు కేటీఆర్‌ను వంగబెట్టి దంచరా?

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన రేవంత్ రెడ్డి బిల్డ్ నౌ యాప్ ను కూడా ప్రారంభించారు. పంచాయతీ రాజ్ శాఖలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 922 మంది అభ్యర్థులకు నేడు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, నిరుద్యోగుల, అమరవీరుల ఆకాంక్షల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అని అన్నారు. గత ప్రభుత్వం కేవలం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, నిరుద్యోగులను నట్టేట ముంచారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క ఏడాది పాలనలో 55 వేల ఉద్యోగ నియామకాలు చేశామని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ రాష్ట్రంలో మొట్ట మొదటి సారిగా 500 పైచిలుకు గ్రూప్ 1 ఉద్యోగాలు ఇచ్చింది తామేనని అన్నారు. 10 ఏళ్ళు నిరుద్యోగల ఉసురు పోసుకున్నందునే కేసీఆర్ ఫాంహౌజ్ కు పరిమితం కావాల్సి వచ్చిందన్నారు. ప్రతిపక్షాలు ఉద్యోగ నియామకాలు ఆపేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా అన్ని ప్రక్రియలు పూర్తి చేస్తున్నామన్నారు. నిరుద్యోగులు కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరగనివ్వకూడదని నిర్ణయించామని, వెంటవెంటనే నోటిఫికేషన్లు, పరీక్షలు, ఫలితాలు ఇస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఇదే కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో ఏ బాధ్యతలు విస్మరించిందో వాటిని తాము నెరవేరస్తున్నామని పేర్కొన్నారు. 10 నెలల్లో మేము చేసిన పనులను 10 ఏళ్లలో మీరు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులను ప్రజలు తిరస్కరిస్తే ఆయన వెంటనే వేరే పదవులు ఇచ్చారని, మరి




ఈ పదేళ్లల్లో ఇంటి పెద్దను కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబానికి కారుణ్య నియామకం ఎందుకు చేపట్టలేదని నిలదీశారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులకు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, 1000 ఆర్టీసీ బస్సులను వారికి అందించి వ్యాపారులుగా మార్చామని పేర్కొన్నారు. 43 లక్షల మంది ఆడపడుచులకు రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని, 59 వేల ఉద్యోగ నియామకాలు ఇచ్చామని.. ఇవన్నీ ఒక్క ఏడాదిలో తాను చేశానని తెలిపారు. ప్రజలు తనపై కోపంగా ఉన్నారని ప్రతిపక్షాలు అనడం విడ్డూరంగా ఉందని.. ఇన్ని పనులు, సంక్షేమ పథకాలు చేసినందుకు తనపై కోపంగా ఉన్నారా అని విపక్షాలను ప్రశ్నించారు. రాజకీయ నాయకులు మాత్రమే మారారని, అధికారులు మాత్రం వారేనని.. తాను ఒక్కసారి ఆర్డర్స్ ఇస్తే.. వారందరినీ లోపల వేస్తారని, కాని తాను కేసీఆర్ లాగ నియంత పనులు చేయలేనని అన్నారు. తనకు ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలుసని, గత పాలకులకు లేని విజ్ఞత తమకు ఉందని అన్నారు. సచివాలయానికి రాని కేసీఆర్ కు పరిపాలన మీద పట్టు ఉంటుందా? రోజుకు 18 గంటలు పనిచేసే తనకు, తన మంత్రులకు పట్టు ఉంటుందా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలను ప్రశ్నించారు. నెల రోజుల్లోనే గ్రూప్ 2,3 ఉద్యోగాలను కూడా ఇస్తామని, ఉద్యోగ నియామక ప్రక్రియ నిరంతరం అని దీనికి ఫుల్ స్టాప్ అనేదే లేదన్నారు. కారుణ్య నియామకాలనేవి మీ హక్కని, ఆ హక్కును కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాసిందని, ఫలితంగా 10 సంవత్సరాలు నష్టపోయారని రేవంత్ రెడ్డి అన్నారు.



# 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 2650 కేంద్రాలలో పరీక్ష రాయనున్న 5,09,403 విద్యార్థులు
- అధికారిక వెబ్ సైట్ లో హాల్ టికెట్లు

**మహా :** పదవ తరగతి పరీక్షలు నేటి మొదలై నెల 4వ తేదీ వరకు జరగనున్నాయి, ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షల నిర్వహణకు సంబంధించి హాల్ టికెట్లను కూడా పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులో తీసుకు వచ్చింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే ఈ పరీక్షలకు 5,09403 మంది విద్యార్థు లు హాజరుకానున్నారు వీరికోసం 2,650 పరీక్ష కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించనుంది. తాజాగా ఎస్ఎస్‌సీ బోర్డు విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి 21వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్, మార్చి 22వ తేదీన సెకండ్ లాంగ్వేజ్, మార్చి 24వ తేదీన ఇంగ్లీష్, మార్చి 26వ తేదీన మ్యాథ్స్, మార్చి 28వ తేదీన ఫిజిక్స్, మార్చి 29వ తేదీన బయాలజీ, ఏప్రిల్ 2వ తేదీన సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహించను న్నారు. ఏప్రిల్ 3న ఒకేషనల్ కోర్సు పేపర్1 లాంగ్వేజ్ పరీక్ష, ఏప్రిల్ 4న ఒకేషనల్ కోర్సు పేపర్2 లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించనున్నారు.

# వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తా



(మొదటిపేజీ తరువాయి)

ఈ రోజు సూర్యాపేటలో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ సభకు ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. వరంగల్ సభ తర్వాత మే నెలలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందన్నారు. కొత్త కమిటీలను పటిష్టంగా నిర్మించుకుందామన్నారు. గ్రామస్థాయి, వార్డు స్థాయి, బూత్ స్థాయి, రాష్ట్ర కమిటీ దాకా అద్భుతంగా కమిటీలను ఏర్పాటు చేసుకుందామన్నారు. కష్టకాలంలో పార్టీనే నమ్ముకొని ఉన్న వారికే పెద్దపీట వేస్తామని.. వారికే అవకాశాలు ఇస్తామని స్పష్టం చేశారు. చిన్న పెద్ద అనే తేడా పార్టీలో లేదన్నారు.

**పార్టీ ఆఫీసులే చైతన్య కేంద్రాలు..**

పార్టీ ఆఫీసులను చైతన్య కేంద్రాలుగా మార్చుకొని కార్యకర్తలకు అద్భుతంగా శిక్షణ ఇస్తామన్నారు. చివరి సంవత్సరంలో ఏదో ఒక పథకం ఇచ్చినట్టు చేస్తే ప్రజలు తమనే మళ్లీ గెలిపిస్తారన్న నమ్మకంతో కాంగ్రెస్ నేతలు ఉన్నారని ధ్వజమెత్తారు. ఈ విషయాలను ప్రజలకు అర్థమయ్యేలా గులాబీ కార్యకర్తలే చెప్పాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలంటే కేసీఆర్ లాగా ప్రతీ కార్యకర్త కథానాయకుడిలాగా విజృంభించాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 27 నాడు దానికి తొలి అడుగు పడాలన్నారు. ఈ సంవత్సరం అంతా బీఆర్ఎస్ పోరాటనామ సంవత్సరం కాబోతోందన్నారు.

**కాంగ్రెస్ తెచ్చిన కరువు**

**సూర్యాపేట :** ఇవాళ తెలంగాణ వ్యాప్తంగా పంటలు ఎండుతున్నాయి అంటే కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి పాపమే రైతన్నకు శాపంలా మారిందని పేర్కొన్నారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. నీళ్ల మంత్రి నల్లగొండలోనే ఉన్నా చుక్కనీరు తేలేకపోతున్నారు. ఎస్ఎల్బీసీ ప్రమాదం జరిగితే ఒక మంత్రి పోయి చాపల కూర చేపించుకొని తిన్నాడు అని కేటీఆర్ విమర్శించారు. క్కొక్క గ్రామం నుంచి బండ్లు కట్టుకుని వరంగల్ సభకు సూర్యాపేట, ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ప్రజలు తరలి రావాలి. కాంగ్రెస్, బిజెపి గుండెల్లో రైళ్లు పరిగెత్తించాల్సిన సందర్భం ఏప్రిల్ 27.. మరొక్కసారి గులాబీ సైన్యం కదం తొక్కాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# అరుదైన గౌరవాన్ని అందుకున్న చిరు

### యూకే పార్లమెంటులో చిరంజీవికి అపురూప సన్మానం
### లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు అందించిన బ్రిడ్జ్ ఇండియా గ్రూప్
### సోషల్ మీడియాలో చిరంజీవి పోస్టు



**మహా :** యూకే పార్లమెంట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవికి ఘన సన్మానం లభించింది. ఎంతోమంది పార్లమెంటు సభ్యులు, మంత్రులు, సహాయ మంత్రులు, దౌత్యవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రిడ్జ్ ఇండియా బృందం ఆయనకు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందజేసింది. దీనిపై చిరంజీవి సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఇంతమంది ప్రముఖుల సమక్షంలో ఈ గౌరవం పొందడం పట్ల నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. వారు నా గురించి చెప్పిన విషయాలు ఎంతో సంతోషాన్ని కలిగించాయన్నారు. బ్రిడ్జ్ ఇండియా బృందం అందించిన జీవితకాల సాఫల్య పురస్కారం నన్ను ఎంతగానో ఆనందపరిచిందని, నా అభిమానులు, రక్తదానంతో నా రక్త సోదరులు, రక్త సోదరీమణులుగా మారిన ప్రతి ఒక్కరికీ, సినీ కుటుంబం, శ్రేయోభిలాషులు, స్నేహితులు, నా కుటుంబ సభ్యులు, నా ప్రయాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, నేను చేపట్టిన మానవతావాద కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు అని చిరంజీవి అవార్డు స్వీకరణ సందర్భంగా ఉద్వేగ్నంగా మాట్లాడారు. ఈ గౌరవం నా పనిని మరింత ఉత్సాహంతో కొనసాగించడానికి నన్ను ప్రేరేపిస్తుందన్నారు. మీ అందరి అందమైన అభినందన సందేశాలకు ధన్యవాదాలు అంటూ చిరంజీవి స్పందించారు. అంతేకాదు, తనకు యూకే పార్లమెంటులో జరిగిన సన్మానం తాలూకు ఫొటోలను కూడా చిరంజీవి పంచుకున్నారు.



# హైకోర్టులో హరీష్‌కు ఊరట

### కేసును కొట్టివేసిన న్యాయస్థానం

**మహా :** బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుకు హౌకోర్టులో ఊరట లభించింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో గత ఏడాది డిసెంబర్ లో నమోదు అయిన కేసును హైకోర్టు కొట్టి వేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా, కనీసం విచారణ కూడా చేయకుండా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చసినట్లు కోర్టు అభిప్రాయ పడింది. తనపై కుట్రపూరితంగా తప్పుడు కేసు నమోదు చేశారని హరీష్ రావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ పై కోర్టులో సాగిన సుదీర్ఘ వాదనల అనంతరం హైకోర్టు గురువారం తుదితీర్పును వెలువరించింది. హరీష్ రావుపై నమోదు చేసిన కేసులో ఎలాంటి ఆధారాలు లేని కారణంగా కేసును కొట్టివేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిపక్షాలపై కక్ష సాధించడానికి కేసులతో వేధించాలనుకునే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది ఒక గుణపాఠమని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బెట్టింగ్ బాజా

## అడ్డంగా బుక్కయిన విష్ణుప్రియ.. పది గంటల నాన్ స్టాప్ విచారణ

### నిమిషానికి 90వేలు ఛార్జ్ చేసిన విష్ణుప్రియ

### ఆమె చెబితేనే ప్రమోషన్ చేశా- రీతూచౌదరి



**హైదరాబాద్, మహా:** బెట్టింగ్ యాప్స్ కేసులో స్టేషన్ కు హాజరైన విష్ణు ప్రియ, రీతూ చౌదరిని పోలీసుల విచారణ ముగిసింది. గురువారం (మార్చి 20) పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో విష్ణు ప్రియను దాదాపు 10 గంటల పాటు విచారించారు. అదేవిధంగా ఇదే కేసులో రీతూ చౌదరిని సుమారు 6 గంటల పాటు విచారించారు. తదుపరి విచారణకు ఈ నెల (మార్చి) 25న ఇద్దరూ హాజరుకావాలని పోలీసులు ఆదేశించారు. విచారణలో భాగంగా స్టేషన్ కు వచ్చిన వెంటనే ఈ ఇద్దరి ఫోన్ లను సీజ్ చేసి విచారణ మొదలు పెట్టారు పోలీసులు. పోలీసుల విచారణకు రీతూ చౌదరి సహకరించలేదని సమాచారం. పోలీసులు అడిగిన ప్రశ్నలకు రీతూ చౌదరి కొన్ని సార్లు సరైన సమాధానం చెప్పలేదు. అయితే బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ గురించి తనకు తెలియదని, విష్ణు ప్రియ చెప్పడం వల్లే చేశానని పోలీసులకు చెప్పింది. ప్రమోషన్ ఎలా చేయాలో కూడా విష్ణు ప్రియనే తనకు తనకు నేర్పించిందని తెలిపింది. విచారణలో తను అమాయకురాలినని, తనకేం తెలియదని అంతా విష్ణు ప్రియే కారణం అని ఆమెపైకి తోసింది రీతూ చౌదరి. అయితే ఈ కేసులో విచారణ పూర్తి చేశారు పోలీసులు. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు సుదీర్ఘంగా విచారించారు. విష్ణు ప్రియ, రీతూ చౌదరి చెప్పిన సమాధానాలను, వారి స్టేట్ మెంట్స్ ను రికార్డు చేసుకున్నారు పోలీసులు. ఈ నెల 25న మరోసారి విచారణకు హాజరుకావాలని ఆదేశించారు.

**ఇండస్ట్రీ కారణం కావొద్దు.. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసే నటులపై చర్యలు కోరుతాం: ఫిల్మ్ ఛాంబర్**

సంచలనం సృష్టిస్తోన్న బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ ఇష్యూపై తెలుగు ఫిల్మ్ చాంబర్ స్పందించింది. ఎవరైనా చట్టానికి కట్టుబడి ఉండాల్సిందేనని.. బెట్టింగ్ యాప్స్ సమాజానికి చెడు చేస్తుంటే సినీ సెలబ్రెటీలు వాటికి ప్రచారం చేయడం ముమ్మాటికి తప్పేనని పేర్కొంది. మా అసోసియేషన్‌కు లేఖ రాస్తామని.. బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసే నటులపై చర్యలు కోరుతామని తెలిపింది.

## నిమిషానికి 90 వేలా విష్ణుప్రియా


బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసి చిక్కుల్లో పడిన యాంకర్ విష్ణుప్రియ పోలీసుల విచారణలో కీలక విషయాలను వెల్లడించింది. పంజాగుట్ట పీఎస్‌లో విచారణకు హాజరైన విష్ణుప్రియ స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు. 15 బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేసినట్లు విష్ణుప్రియ పోలీసులకు వెల్లడించింది. ఒక్కో వీడియోకు రూ.90 వేలు వచ్చినట్లు పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో విష్ణుప్రియ తెలిపింది. ఈ లెక్కన 15 బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన విష్ణుప్రియ లక్షల్లో సంపాదించింది. ఈ కేసులో విష్ణు ప్రియ విచారణ పూర్తయింది. విష్ణు ప్రియ మొబైల్‌ను పంజాగుట్ట పోలీసులు సీజ్ చేశారు.

# భర్తను ముక్కలుగా నరికి హత్య చేసిన భార్య

## 15 ముక్కలుగా చేసి డ్రమ్ములో పెచ్చి పూడ్చిపెట్టిన దుర్మార్గురాలు

### ప్రేమికుడితో కలిసి ఘాతుకానికి పాల్పడ్డ యువతి.. వివాహేతర సంబంధమే కారణమన్న పోలీసులు


**మహా :** ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తకు ద్రోహం చేయడంతో పాటు తమ అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడన్న కారణంతో భర్తను ముక్కలుగా నరికి చంపింది ఓ దుర్మార్గురాలు. ఉత్తర ప్రదేశ్ లో దరిగిమన ఈ ఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సౌరభ్ రాజ్‌పుత్, ముస్కాన్ రస్తోగి 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్యతో ఎక్కువ సమయం గడపాలనే కోరికతో, సౌరభ్ తన నేవీ ఉద్యోగాన్ని విడిచిపెట్టాడు. అయితే, ఉద్యోగాన్ని వదిలివేయాలనే అతని ఆకస్మిక నిర్ణయం అతని కుటుంబానికి నచ్చలేదు. ఇది ఇంట్లో ఘర్షణకు దారితీసింది. ఇంకా ముస్కాన్ తన స్నేహితుడు సాహిల్‌తో ప్రేమ వ్యవహారం నడుపుతుందని సౌరభ్‌కు తెలిసింది. తన కుమార్తె భవిష్యత్తు కోసం విడాకుల తీసుకోకుండా నేవీలో తిరిగి చేరేందుకు 2023లో, దేశం విడిచి వెళ్లిపోయాడు. సౌరభ్ కూతురికి ఫిబ్రవరి 28న ఆరు సంవత్సరాలు నిండాయి. ఇందుకోసం ఫిబ్రవరి 24న ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటికి, ముస్కాన్, సాహిల్ బాగా దగ్గరయ్యారు. దీంతో సౌరభ్‌ను హత్య చేసేందుకు పక్కా స్కెచ్ వేశారు. మార్చి 4న ముస్కాన్ సౌరభ్ ఆహారంలో నిద్రమాత్రలు కలిపాడు. అతను నిద్రపోతున్న తర్వాత, ఆమె మరియు సాహిల్ కత్తితో అతన్ని హత్య చేశారు. వారు మృతదేహాన్ని ముక్కలుగా చేసి, ముక్కలను డ్రమ్ములో వేసి తడి సిమెంటుతో మూసివేశారు. అయితే సౌరభ్ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం భార్య ఇచ్చే సమాధానం పొంతన లేకపోవడంతో.. సౌరభ్ ఫ్యామిలీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ముస్కాన్ సాహిల్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించినప్పుడు, హత్యకు పాల్పడినట్లు అంగీకరించారు. ఆ తర్వాత వారు మృతదేహం ఎక్కడ ఉందనే దిగ్భ్రాంతికరమైన విషయాన్ని వెల్లడించారు. పోలీసులు డ్రమ్‌ను కనుగొన్నారు. కానీ సుత్తి మరియు ఉలి ఉపయోగించి గట్టి సిమెంటును పగలగొట్టడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. సౌరభ్ శరీర ముక్కలతో కూడిన డ్రమ్‌ను మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతుంది.



# నీతో కాపురం చేయాలా

## రోజుకు 5 వేలు ఇస్తేనే చేస్తా

- టెకీకి భార్య వేధింపులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి
- ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తోందని వెల్లడి
- విడాకులు కోరితే రూ.45 లక్షలు డిమాండ్ చేస్తోందని ఆవేదన



**మహా :** భార్య వేధింపులు భరించలేకపోతున్నానంటూ బెంగళూరుకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ శ్రీకాంత్ పోలీసులను ఆశ్రయించారు. నిత్యం దూషించడం, డబ్బుల కోసం డిమాండ్ చేయడంతో పాటు అడిగినంత ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తోందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాదు, తనతో కాపురం చేయాలంటే రోజుకు రూ.5 వేలు ఇవ్వాలని అడుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్క్ ఫ్రం హోం చేసుకోనివ్వడం లేదని, జూమ్ కాల్ మాట్లాడుతుంటే మధ్య మధ్యలో వచ్చి డ్యాన్స్ చేస్తోందని చెప్పారు. ఇవన్నీ భరించలేక విడాకులు కోరితే రూ.45 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోందన్నారు. తమకు 2022 లోనే వివాహం జరిగిందని తెలిపారు. కాగా, శ్రీకాంత్ భార్య మాత్రం ఇవన్నీ తప్పుడు ఆరోపణలని కొట్టిపారేశారు. మరో పెళ్లి చేసుకోవడం కోసం తనపై నిందలు వేస్తున్నాడని, ఆడియోలు వీడియోలను ఎడిట్ చేసి వాటితో పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశాడని ఆరోపించారు.

# గుడ్ కీపిటప్

## ఎమ్మెల్సీ గెలుపుపై రాష్ట్ర నేతలను అభినందించిన అమిత్ షా


### స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటాలన్న కేంద్ర హోం మంత్రి

### బీజేపీ రాష్ట్ర కీలక నేతలతో భేటీ అయిన షా



**మహా :** ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాదిరిగానే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా టీబీజేపీ నేతలకు సూచించారు. గురువారం పార్లమెంట్ భవనంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ఎంపీలు, కొత్తగా ఎంపికైన ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇతర సీనియర్ నాయకులు అమిత్ షాను కలిశారు. ఇటీవల ఎమ్మెల్సీలుగా ఎన్నికైన మల్కా కొమురయ్య, అంజిరెడ్డిని అమిత్ షా అభినందించారు. ఇక నుంచి తెలంగాణలో ఏ ఎన్నిక జరిగినా బీజేపీనే విజయం వరించాలని, ఆ దిశగా పార్టీని, శ్రేణులను సన్నద్ధం చేయాల్సిన బాధ్యత నేతలదేనని అమిత్ షా ఈ సందర్భంగా నేతలతో అన్నారు.ఈ భేటీలో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డా.కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అయితే పార్టీలో ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరనే దానిపై జోరుగా చర్చ జరుగుతోంది. ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయంతో కాషాయపార్టీలో జోష్ కనిపిస్తోంది. ఈ జోష్‌ను కంటిన్యూ చేసేలా కొత్త అధ్యక్షుడి పేరును పార్టీ పెద్దలు అనౌన్స్ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారనే చర్చ జరుగుతోంది. అయితే వచ్చే నెల 1820 తేదీలలో బెంగళూరులో బీజేపీ కౌన్సిల్ మీటింగ్ జరగబోతున్నది. ఈ సమావేశం తరువాతే కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# శివజ్యోతిపై నెటిజన్ల శివాలు




### ఈవిడ ఎలా మిస్ అయింది?

### అరెస్టుకు రంగం సిద్ధం!

బెట్టింగ్ యాప్ కేసులో మరిన్ని సంచలనాలు బయటపడుతున్నాయి. ఇప్పటికే 25 మందిపై కేసు నమోదు చేయగా మరికొంతమంది సెలబ్రిటీల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రముఖ ఛానెల్‌లో యాంకర్‌గా పనిచేసి, బిగ్ బాస్ రియాల్టీ షోలో కంటెస్టెంట్‌గా జనాలను అలరించిన శివజ్యోతి సైతం బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసినట్లు వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. 'ఇప్పటికీ కూడా జనాలు మనదగ్గరకు వచ్చి బాగా హార్డ్ వర్క్ చేస్తే పైసలు సంపాదించొచ్చు అని చెబుతున్నారా? అయితే అసలు పట్టించుకోకండి. ఇప్పుడు మీ డ్రీమ్ రన్ ను 1ఎక్స్ బెట్ తో ప్రారంభించండి' అంటూ ఆమె చెప్పిన వీడియోను నెటిజన్లు షేర్ చేస్తున్నారు. శివజ్యోతి ఎలా మిస్ అయింది? . న్యూస్ చదివే స్థాయి నుంచి ఇప్పుడు కోట్లు సంపాదించే స్థాయికి ఎదిగింది ఈ బెట్టింగ్ యాప్ వల్లనే. వెంటనే అరెస్ట్ చేయండి. సజ్జనార్ సర్ ఈమెని కాపాడుతున్నది ఎవరు? పల్లెటూరి యువతని బెట్టింగ్ వైపు ఆకర్షించి ఎందరో అమాయకుల ప్రాణాలు బలిగొన్న ఈమెపై ఇంకా కేసు ఎందుకు నమోదు అవ్వడం లేదు?' అంటూ పోలీసులను ప్రశ్నిస్తున్నారు. దీంతో శివజ్యోతి పై కూడా కేసు నమోదు చేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# అవును ఆ యాడ్ చేశా తర్వాత తప్పు తెలుసుకున్నా

## బెట్టింగ్ యాప్ వ్యవహారంపై ప్రకాశ్‌రాజ్

### అందరినీ ప్రశ్నించే నేను సమాధానం చెప్పాలి కదా



**మహా :** ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోంది బెట్టింగ్ యాప్‌ల వ్యవహారం. వాటికి ప్రచారకర్తలుగా ఉన్న సినీ నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణకు పిలుస్తున్నారు. ఈ జాబితాలో సీనియర్ నటుడు ప్రకాశ్‌రాజ్ పేరు కూడా ఉంది. ఈ వ్యవహారం తన దృష్టికి రావడంతో ప్రకాశ్‌రాజ్ స్పందించారు. ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. ''ప్రస్తుతం నేను ఒక విలేజ్‌కు షూటింగ్ కోసం వచ్చాను. ఆన్‌లైన్ గేమింగ్ యాప్ కేసుల గురించి, నేను చేసిన యాడ్ గురించి చర్చ జరుగుతోందని ఇప్పుడే నాకు తెలిసింది. అందరినీ ప్రశ్నించే నేను సమాధానం చెప్పాలి కదా! 'అలాంటి ప్రకటన ఎలా చేస్తార'ని అందరూ నన్ను ప్రశ్నిస్తున్నారు. 2016లో ఆ యాడ్ నా దగ్గరకు వచ్చింది. చేసిన మాట నిజం. అది తప్పని కొద్ది నెలల్లోనే తెలుసుకున్నా. 2017లో నా అగ్రిమెంట్ పొడిగిస్తానని వాళ్లు అడిగితే, 'ఆ యాడ్ తెలియక చేశాను. ఏడాది కోసం అగ్రిమెంట్ అయిపోయింది కాబట్టి, వెంటనే దాన్ని ఆపమని మీకు చెప్పలేకపోయా. ఇక ఆ యాడ్‌ను ప్రసారం చేయొద్దు. నేనూ నటించను' అని చెప్పాను. దాని తర్వాత ఏ గేమింగ్ యాప్‌లకు ప్రచారకర్తగా పనిచేయలేదు'' ''2021లో ఆ కంపెనీ ఇంకో కంపెనీకి అమ్మేస్తే, ఏదో సోషల్‌మీడియా వేదికలో నా ప్రకటన వాడారు. అందుకు వాళ్లకు లీగల్ నోటీసులు పంపాను. ఆ ప్రకటన తొలగించాలని వాట్సాప్ ద్వారా కూడా సంప్రదించాను. వెంటనే వాళ్లు ఆపేశారు. ఇప్పుడు మళ్లీ అది లీకైంది. అందువల్లే ఈ సమాధానం చెబుతున్నా. ఇప్పటివరకూ పోలీస్‌శాఖ నుంచి నాకు ఎలాంటి సందేశం రాలేదు. వస్తే, వాళ్లకు వివరణ ఇస్తా. మీకు (ప్రజలకు) ఇప్పుడు సమాధానం చెబుతున్నా 9ఏళ్ల కిందట అదీ, ఏడాది కాంట్రాక్ట్ కోసం పనిచేసిన మాట వాస్తవం. మళ్లీ ఆ యాడ్ చేయలేదన్నది నిజం. ఈ సందర్భంగా మీ అందరికీ ఒక విషయం చెప్పాలనుకుంటున్నా. గేమింగ్ యాప్స్ ఒక వ్యసనం. యువత దీనికి దూరంగా ఉండండి. మీ జీవితం కోల్పోకండి'' అని ప్రకాశ్‌రాజ్ తెలిపారు.

# నక్సల్స్ ముక్త భారత్‌లో మరో విజయం

**మహా :** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎదురు కాల్పుల్లో 22 మావోయిస్టులు మృతి చెందిన ఘటనపై కేంద్రమంత్రి అమిత్ షా స్పందించారు. భారత్‌ను నక్సల్ రహిత దేశంగా మార్చేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో ఇది మరో పెద్ద విజయమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తోందని పేర్కొన్నారు. ''అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నా కొందరు నక్సలైట్లు లొంగిపోవడం లేదు. అలాంటి వారి పట్ల మోదీ సర్కార్ కఠిన వైఖరి అవలంబిస్తోంది. నేడు మన సైనికులు 'నక్సల్ ముక్త్ భారత్ అభియాన్' దిశలో మరో పెద్ద విజయాన్ని సాధించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకెర్‌లలో మన భద్రతా దళాలు నిర్వహించిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో 22 మంది నక్సలైట్లు హతమయ్యారు. 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుంది'' అని 'ఎక్స్' వేదికగా అమిత్ షా పేర్కొన్నారు. బీజాపూర్, కాంకెర్ జిల్లాల్లో ఒకే రోజు వేర్వేరు ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ కాల్పుల్లో 22 మంది నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఎదురు కాల్పుల్లో ఓ జవాను అమరుడయ్యారు. ఈ విషయాన్ని అధికారులు వెల్లడించారు. బీజాపూర్ దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న గంగలూరు పరిధి అండ్రి అడవుల్లో నక్సల్స్ నక్కినట్లు నిఘా సమాచారం వచ్చింది. దీంతో జిల్లాల నుంచి సంయుక్త బలగాలు గురువారం ఉదయం నుంచి అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య భారీ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ నేపథ్యంలోనే స్పందించిన అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు.

# తెలుగు సినిమాల్లో అసభ్యకరమైన డ్యాన్స్ స్టెప్స్

## ఇండ్రస్ట్రీపై తెలంగాణ మహిళా కమిషన్ సీరియస్..!

### పద్ధతి మార్చుకోవాలని హెచ్చరిక.. అసభ్యకర డ్యాన్స్ స్టెప్పులపై ఫైర్



**మహా :** తెలుగు సినిమా పాటల్లో మహిళలతో అసభ్యకరంగా డ్యాన్స్ చేస్తూ చూపించారని వచ్చిన ఫిర్యాదులపై తెలంగాణ మహిళా కమిషన్ సీరియస్ అయింది. అటువంటి కంటెంట్‌ను ప్రోత్సహించవద్దని తెలుగు సినిమా నిర్మాతలు, కొరియోగ్రాఫర్‌లను హెచ్చరించింది. ఇటువంటి సీన్లు ఇలానే కొనసాగిస్తే సంబంధిత చట్టాల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ నేరెళ్ల శారద వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. 'తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఇటీవల కొన్ని సినిమా పాటల్లో ఉపయోగిస్తున్న డాన్స్ స్టెప్స్ అసభ్యంగా, మహిళలను కించపరిచే విధంగా ఉన్నాయని పలు ఫిర్యాదులు అందాయి. ఈ అంశంపై కమిషన్ తీవ్రంగా స్పందించింది. సినిమా అనేది సమాజంపై ప్రభావం చూపే శక్తివంతమైన మాధ్యమం కావడంతో, ఇందులో మహిళలను అవమానించే లేదా అసభ్యకరంగా చూపించే అంశాలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సినిమా దర్శకులు, నిర్మాతలు, కొరియోగ్రాఫర్లు, సంబంధిత వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మహిళా కమిషన్ హెచ్చరిస్తోంది. మహిళలను తక్కువ చేసి చూపించే, అసభ్యకరమైన డాన్స్ స్టెప్స్‌ను వెంటనే నిలిపివేయాలి. ఈ హెచ్చరికను పాటించకపోతే, సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. సినిమా రంగం సమాజానికి సానుకూల సందేశాలను అందించడం, మహిళల గౌరవాన్ని కాపాడటం అనేది నైతిక బాధ్యత. యువత, పిల్లలపై సినిమాలు చూపించే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని, సినిమా పరిశ్రమ స్వీయ నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉంది. ఈ అంశంపై ప్రజలు, సామాజిక సంస్థలు తమ అభిప్రాయాలను మహిళా కమిషన్‌కు తెలియజేయవచ్చు. ఈ విషయం పై నిశితంగా పరిశీలన కొనసాగిస్తూ, అవసరమైన మరిన్ని చర్యలు తీసుకుంటాం.' అని మహిళా కమిషన్ హెచ్చరించింది. కాగా, ఇటీవల కొన్ని తెలుగు సినిమాల్లోని పాటలు వివాదాస్పదమయ్యాయి. నితిన్ హీరోగా నటించిన.. రాబిన్ హుడ్ మూవీలో కేతిక శర్మ వేసిన స్టెప్స్ అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయంటూ మహిళా లోకం మండిపడింది. సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెట్టారు. బాలకృష్ణ హీరోగా నటించిన డాకూ మహరాజ్ మూవీలోనూ హీరోయిన్ ఉర్వశి రౌతేలాతో కంపోజ్ చేసిన దబిడి.. దిబిడి సాంగ్‌పైనా విమర్శలు వచ్చాయి. రవితేజ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా వచ్చిన మిస్టర్ బచ్చన్ మూవీలోనూ కొన్ని స్టేప్స్ వివాదాస్పదం అయ్యాయి. దీంతో తెలంగాణ మహిళా కమిషన్‌కు ఫిర్యాదులు రాగా.. రంగంలోకి దిగిన చైర్‌పర్సన్ హెచ్చరికలు జారీ చేశారు.

# ఉనికి కోసమే బడ్జెట్ పై ప్రతిపక్షాల విమర్శలు

### మంత్రి పొన్నం ప్రభాకర్

**మహా :** తమ ఉనికిని కాపాడుకునేందుకే ప్రతిపక్షాలు రాష్ట్ర బడ్జెట్ పై విమర్శలు చేస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. 202526 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ చాలా పారదర్శంగా ఉందన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బడ్జెట్ లో అన్ని వర్గాలకు అవకాశం దక్కిందని ఇది ప్రజారంజక బడ్జెట్ అన్నారు. చర్చలో ఉండేందుకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటామని మంచినీటి సమస్యలపై సమావేశం నిర్వహిస్తామన్నారు.

# హైకోర్టులో బండి సంజయ్‌కు భారీ ఊరట

### జీహెచ్‌ఎంసీ ఎన్నికల ప్రచారంలో కేసు నమోదు

### ఆధారాల్లేవన్న న్యాయవాది వాదన – కేసు కొట్టివేత




**మహా :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల ప్రచార సమయంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించారనే ఆరోపణలపై సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయనపై ఛార్జ్‌షీట్ కూడా దాఖలైంది. అయితే, తగిన ఆధారాల్లేవన్న కారణంతో హైకోర్టు ఈ కేసును కొట్టివేసింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సందర్భంగా బీజేపీ నాయకుడు బండి సంజయ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని కొందరు వ్యక్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతో స్పందించిన సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి, విచారణ అనంతరం ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేశారు. బండి సంజయ్‌పై నమోదైన కేసు హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా బండి సంజయ్ తరఫున న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. బండి సంజయ్ మత విద్వేషాలను రెచ్చగొట్టారని నిరూపించే ఆధారాలు లేవని న్యాయవాది వాదించారు. ఆధారాలు లేకుండా రాజకీయం చేయడానికి కేసు నమోదయ్యిందని కోర్టుకు వివరించారు.

# హనీ ట్రాప్‌లో ఇరుక్కున్న 48 మంది కర్ణాటక ఎమ్మెల్యేలు



## ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించిన ప్రభుత్వం

### అసెంబ్లీలో దుమారం

**మహా:** జాతీయ స్థాయి నేతలు సహా, మంత్రులు, ఎమ్మెల్యేలు మొత్తం 48 మంది రాజకీయ నాయకులు హనీ ట్రాప్ ఉచ్చులో పడ్డారని అసెంబ్లీలో వ్యాఖ్యలు చేసిన సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న. 48 మంది నాయకుల అసభ్య వీడియోలు సీడీలు, పెన్ డ్రైవ్ లో ఉన్నాయని.. ఇందులో అధికార, విపక్ష పార్టీ సభ్యులు ఉన్నారని తెలిపిన మంత్రి. దీనిపై హోంశాఖకు ఫిర్యాదు చేస్తానని, దీని వెనక ఎవరు ఉన్నారనే విషయం ప్రజలకు కూడా తెలియాలని స్పష్టం చేసిన మంత్రి రాజన్న . ఒక మంత్రిపై రెండుసార్లు హనీ ట్రాప్ యత్నం జరిగిందని, ఇది కొత్త కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది వీటిని వాడుకుంటున్నారని తెలిపిన మంత్రి సతీశ్ జారి హోళీ. ఈ కేసులో ఎవరినైనా అరెస్టు చేశారో లేదో తనకు తెలియదని, దర్యాప్తు పూర్తయితే అన్ని విషయాలు బయటకు వస్తాయని స్పందించిన డిప్యూటి సీఎం డీకే శివకుమార్.

# ఎమ్మెల్యే గారు బీ అలర్ట్

- అప్రమత్తంగా ఉండాలంటూ రాజాసింగ్ కు పోలీసుల నోటీసులు
- ప్రజల్లోకి వెళ్లాలంటే.... గన్ లైసెన్స్ ఇవ్వండి
- పోలీసులకు ఎమ్మెల్యే లేఖ

**మహా :** గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కు ఇవాళ ఉదయం మంగళ్‌హాట్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గత నెల రోజులుగా చంపేస్తామంటూ ఆయనకు ఆగంతకుల నుంచి వరుసగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. ఇవాళ కాకపోతే రేపు అయినా నీ తల నరికేస్తామని ఆగంతకులు రాజాసింగ్‌ను బెదిరించారు. గుర్తు తెలియని ఫోన్ నంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నట్లుగా ఆయన అనుచరులు కూడా తెలిపారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేకు నోటీసులు జారీ చేస్తూ, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా రాజా సింగ్ భద్రత కోసం పోలీసులు బుల్లెట్ ప్రూఫ్ వెహికిల్ అందుబాటులో ఉంచారు. అదనంగా, 1+4 సెక్యూరిటీ సద్వినియోగం చేసుకోవాలని కూడా కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి ప్రమాదం జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోషామహల్ నియోజకవర్గంలోని రహదారులు ఇరుకుగా ఉండటంతో బుల్లెట్ ప్రూఫ్ వాహనం అక్కడ ప్రయాణించడం కష్టమవుతోందని ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. అందువల్ల ఎలాంటి పరిస్థితులనైనా స్వయంగా ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతో గన్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేస్తున్నానని చెప్పారు. భద్రతా కారణాల వల్ల తనకు గన్ లైసెన్స్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. రాజకీయ నాయకుడిగా ఉండటం వల్ల తనకు ఎప్పుడైనా ప్రమాదం ఎదురవవచ్చని రాజాసింగ్ అన్నారు. పోలీసుల భద్రత కేవలం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఉండడం వల్ల ప్రతి సమయంలో భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గన్ లైసెన్స్ ఉంటే తన ప్రాణాలను రక్షించుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు రాజాసింగ్ గన్ లైసెన్స్ కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. రాజాసింగ్ పెట్టుకున్న ఈ విజ్ఞప్తిపై పోలీసులు ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. భద్రతా కారణాలను పరిశీలించిన తర్వాతే ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో అధికారులుగా తాము చర్చిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యేకు భద్రతను మరింత పటిష్ఠంగా చేయాలని ఆలోచిస్తున్నామన్నారు. అవసరమైతే అదనపు భద్రత కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



## తెలంగాణకు 2,500 ఏళ్ల చరిత్ర

### స్మితా సబర్వాల్

తెలంగాణ త్రిలింగ దేశంగా ప్రాముఖ్యత కలిగిందని, ఈ ప్రాంతానికి 2,500 ఏళ్ల చరిత్ర ఉందని పర్యటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు. రాష్ట్రం ఏర్పడిన 11 ఏళ్లలో ఎంతో వృద్ధి సాధించామని చెప్పారు. రామప్ప, వేయి స్తంభాల ఆలయం, చార్మినార్, గోల్కొండ కోట లాంటి ఎన్నో గొప్ప కట్టడాలు ఇక్కడ ఉన్నాయని వివరించారు. మేలో మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మెడికల్ టూరిజంలో తెలంగాణకు ఎంతో ప్రాముఖ్యత ఉందని.. సినిమా, ఆహార రంగాల్లో పెట్టింది పేరన్నారు.

# ప్రపంచం చూపు.. తెలంగాణ వైపు

## ఈ సమ్మర్ మనదే.. తెలంగాణ సర్కార్ అదిరిపోయే టూరిజం ప్లానింగ్

3 వేల మంది ప్రపంచ మీడియా ప్రతినిధులు హాజరుకానున్నారు. తెలంగాణలోని 10 ప్రాంతాల్లో మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. ప్రారంభ, ముగింపు కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరుగుతాయి. దీనికోసం హైటెక్స్, శిల్పారామం, గచ్చిబౌలి స్టేడియాలను పరిశీలిస్తున్నారు. మిగిలిన 8 ఈవెంట్లు తెలంగాణలోని పోచంపల్లి, యాదగిరిగుట్ట,రామప్ప, లక్నవరం, నాగార్జున సాగర్, వికారాబాద్ వంటి ప్రాంతాల్లో జరగనున్నాయి. ఇక, ఈ మిస్ వరల్డ్ పోటీలను రాష్ట్ర పర్యాటకం, సంస్కృతి, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి వేదికగా మలుచుకుంటామని పర్యాటక శాఖ వెల్లడించింది. మొత్తం పది చోట్ల మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించటం ద్వారా ఆయా ప్రాంతాలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రమోషన్ చేసినట్లు ఉంటుందని భావిస్తోంది. పోచంపల్లి ఈవెంట్ సందర్భంగా సుందరీమణులు పోచంపల్లికి వెళ్లనున్నారు. చేనేత కార్మికులతో ముచ్చటించనున్నారు. చేనేత వస్త్రాల తయారీని వారు పరిశీలించనున్నారు. ఆ తర్వాత పోచంపల్లి చీరెలను ధరించి స్టేజి మీద ర్యాంప్ వాక్ చేయనున్నారు. ఇలా చేయటం ద్వారా చేనేత వస్త్రాలకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు వస్తుందని సాంస్కృతిక శాఖ భావిస్తోంది. బౌద్ధులను ఆకర్షించేందుకు నాగార్జున సాగర్ లోని బుద్ధవనాన్ని ఎంపిక చేశారు. అందాల పోటీల్లో పాల్గొనే వారంతా బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించనున్నారు.

### పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంగా..

తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులను, పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహిస్తోంది. ఈ పోటీల సందర్భంగా 140 దేశాలకు చెందిన ప్రతినిధుల ముందు తెలంగాణ రాష్ట్ర వారసత్వ సంపద, చేనేత రంగం, జానపద నృత్యాలు, సంగీతం, వంటకాల వంటివి ప్రదర్శించనున్నారు. మిస్ వరల్డ్ పోటీల్లో తెలంగాణలోని వివిధ ప్రాంతాల విశిష్టతలను తెలుపుతూ వీడియోలను కూడా రూపొందించనున్నారు. తద్వారా రాష్ట్ర పర్యాటకానికి ప్రపంచ వ్యాప్త గుర్తింపు లభిస్తుందని, 200 కోట్లు ఖర్చు పెట్టి తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించటం వల్ల లాభమే తప్ప నష్టం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం నొక్కి వక్కానిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ మిస్ వరల్డ్ పోటీలపై విమర్శలు చేయడానికి కారణం లేకపోలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేసులను నిర్వహించారు. ఇందుకోసం 40 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. దీన్ని కాంగ్రెస్ నాయకులు తప్పుబట్టారు. ఫార్ములా ఈ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద మొత్తంలో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిందంటూ మండిపడ్డారు.

# భారత్ నా హృదయానికి నచ్చింది

## భారత సంస్కృతీ, కళలు ఎంతో గొప్పగా ఉన్నాయి.. మిస్ వరల్డ్ క్రిస్టినా

మహా : భారత ధేశ సంస్కృతీ, సంప్రదాయం, ఆచార వ్య.వహారాలు, కట్టుబాట్లు తనను మంత్ర ముగ్ధులను చేసిందని మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా అన్నారు. తెలంగాణ వాసులు తనకు చాలా గొప్పగా స్వాగతం పలికారని, తన హృదయంలో ఈ దేశానికి చాలా ప్రాధాన్యత ఉందని అన్నారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. భారత సంస్కృతి, కళలు చాలా గొప్పగా ఉన్నాయని చెప్పారు. ఇక్కడ స్ఫూర్తి లభిస్తోందని, విలువలు బోధిస్తారని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వం ఎంతో గొప్ప భావన అని పేర్కొన్నారు. "ఎన్నో భాషలు ఉన్నా అంతా ఒక్కటిగా ఉండటం భారత్ స్ఫూర్తి. ఎవరి భావాలు, సాంప్రదాయాలు, ఆచారాలు వారికున్నప్పటికీ అందరూ ఒక్కటే అన్న భావన ఇక్కడి ప్రజలు ఉన్న గొప్పతమని ప్రశంసించారు. మిస్ వరల్డ్ కూడా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక" అని క్రిస్టినా పిస్కోవా అన్నారు. నమస్తే ఇండియాతో ప్రసంగం మొదలుపెట్టిన ఆమె.. తెలంగాణలోని దేవాలయాల గురించి మాట్లాడారు. తమ కోసం ఇన్ని ఏర్పాట్లు చేసినందకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఇండియా గొప్ప ప్రదేశం అని, 2024 మిస్ వరల్డ్ గా తన ప్రస్థానం ఇండియాతో మొదలైందని చెప్పకొచ్చారు. అలాగే ఇండియా మనకు చాలా నేర్పుతుందని, ప్రతీ విషయంలో స్పూర్తినిస్తుందని తెలిపారు. అంతేక తెలంగాణలో చాలా దేవాలయాలను సందర్శించానని, ఇక్కడి దేవాలయాలు గొప్ప విలువలను నేర్పుతాయని అన్నారు. ఇక ఇండియాలో ఒక స్పిరిట్ ఉందని, వివిధ మతాల వారు.. వివిధ భాషల వారు కలిసి జీవిస్తున్నారని కొనియాడారు. ఇక్కడ ట్రెడిషన్ కూడా చాలా బాగా నచ్చిందని, ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు.



# మిస్ వరల్డ్ పోటీలకు అతిథ్యమివ్వడం తెలంగాణకు గర్వకారణం

- తెలంగాణ సంస్కృతిని పరిచయం చేసే సువర్ణావకాశం
- అందాల పోటీలను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలి
- రాజకీయ కోణంలో మిస్ వరల్డ్ పోటీలను చూడటం సరికాదు
- మిస్ వరల్డ్ ప్రి ఈవెంట్ లో మంత్రి జూపల్లి కృష్ణారావు




**మహా:** ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిధ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని, ఫ్యూచర్ సిటీగా ఎదుగుతున్న విశ్వనగరం హైదరాబాద్.. ఈ ఈవెంట్ కు వేదికగా నిలవడం గర్వంగా ఉందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బేగంపేట్ టూరిజం ప్లాజాలో గురువారం మిస్ వరల్డ్ పోటీలకు చెందిన ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, టూరిజం సెక్రటరీ స్మితా సబర్వాల్, మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ జూలియా మోర్లీ, 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అతిధులకు వేద మంత్రాలతో పూర్ణకుంభం స్వాగతం పలికారు. అనంతరం విగ్నేశ్వర పూజ చేసి, అతిధులందరికి వేదాశీర్వచనం చేశారు. ప్రారంభంలో పేరిణి నాట్య కళాకారులతో హారతి నిచ్చి, తిలకధారణతో పలికిన ఆహ్వానం అందరిని ఆకట్టుకుంది. ఫిలిగ్రి వెండి వస్తువులు, చేర్యాల నఖాషి చిత్రాలను కళాకారులు ప్రదర్శించారు. ప్రసిద్ధిగాంచిన పోచంపల్లి చేనేత పట్టు వస్త్రాలను అక్కడిక్కడే మగ్గంపై నేసి చూపించడం అంతర్జాతీయ మీడియాకు అదనపు ఆకర్శణగా నిలిచింది. తెలంగాణ పర్యాటక శాఖ వెబ్ సైట్ ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ నెలవని, ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యటక అందాలను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ సిఎం రేవంత్ రెడ్డి ఆలోచన నుంచి వచ్చిందని, తెలంగాణ జానపద కళలను తెలియజేయడం, చారిత్రక, వారసత్వ కట్టడాలు, ప్రసిద్ధ దేవాలయాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాలను దర్శించేలా చేయడంతో పాటు తెలంగాణ, హైదరాబాద్ రుచులను పరిచయం చేసేందుకు ఇదో అద్భుత అవకాశంగా భావిస్తున్నామని చెప్పారు. ప్రపంచ సుందరి పోటీలను తెలంగాణ సంస్కృతి సొగసులు అద్దేలా, భారతీయ వారసత్వ మూలాలోనే వీటిని నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ చరిత్రాత్మకమని, వేలాది ఏళ్ల చరిత్ర ఉన్న కొత్త రాష్ట్రంలో కొత్త కార్యక్రమం జరుగుతోందని, మహిళల ఆత్మ సౌందర్యాన్ని సెలబ్రేట్ చేయడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశమని, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని వెల్లడించారు. దక్షిణ కొరియాలో స్క్విడ్ గేమ్, బీటీఎస్ బ్యాండ్ లాంటివి ఆ దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయని, ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణకు పేరు ప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తుందని భావిస్తున్నామని తెలియజేశారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచస్థాయి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఇది మంచి అవకాశమని, రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందాల పోటీలను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలి. ప్రభుత్వంపై విమర్శలకు, రాజకీయ కోణంలోనే మిస్ వరల్డ్ పోటీలను చూడటం సరికాదని హితవు పలికారు. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సాధారణంగా ఆతిధ్య రాష్ట్రంతో 5050 భాగస్వామ్య నమూనాను అనుసరిస్తుందని, ఈ పోటీలకు రూ. 55 కోట్లు అంచనా వ్యయం కాగా రూ. 27 కోట్ల రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది, మిగిలిన సగం నిధులను నిర్వహకులు సమకూరుస్తారని, అయితే ఈ ఈవెంట్ లో స్పాన్సర్స్ ను భాగస్వాములు చేస్తున్నందు వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడదని, పర్యాటక అభివృద్ధి సంస్థ రూ. 5 కోట్లు మాత్రమే వెచ్చిస్తుందని, మిగితా నిధులు స్పానర్స్ నుంచి సమకూరుతాయని వివరించారు.

మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ వల్ల తెలంగాణలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించవచ్చని తెలిపారు. సుమారు 140 దేశాల వారు ఇక్కడికి వస్తారని ప్రపంచం దృష్టి తెలంగాణ రాష్ట్రంపై పడుతుందని వివరించారు. అందాల పోటీలు అంటే ఇంకో కోణంలో చూడొద్దని ఇది ఎంతో మంది అమ్మాయిలకు, మహిళలకు, మనోధైర్యం, సంకల్పం ఇస్తుందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. నమస్తే ఇండియా అంటూ 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా పలకరించింది. అతిథులు చాలా గొప్పగా స్వాగతం చెప్పారని అన్నారు. తన ప్రయాణంలో, తన హృదయంలో భారతదేశానికి చాలా ప్రాధాన్యత ఉందని తెలిపారు. భారత కల్చర్, ఆర్ట్స్ చాలా గొప్పగా ఉంటాయని వివరించారు. భారతదేశం చాలా ఇన్‌స్పైరింగ్ అని అన్నారు. భారత్ విలువలను బోధిస్తుందని.. భిన్నత్వంలో ఏకత్వానికి ఎంతో గొప్ప భావన ఉందని చెప్పుకొచ్చారు. ఎన్నో భాషలు ఉన్నా అంత ఒక్కటిగా ఉండటం భారతదేశం స్ఫూర్తి అని పేర్కొన్నారు. మిస్ వరల్డ్ పోటీలు కూడా అంతే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని చెప్పారు.. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించడం మంచి అనుభూతిని ఇచ్చిందని, ఈ జర్నీ తనకు ఎప్పటికీ గుర్తుండి పోతుందని క్రిస్టినా పిజ్కోవా పేర్కొన్నారు. తెలంగాణ త్రిలింగ దేశంగా ప్రాముఖ్యతను కలిగి ఉందని పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ తెలిపారు. ఈ ప్రాంతానికి వేలాది ఏళ్ల చరిత్ర ఉందని ఉద్ఘాటించారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, వేయి స్థంభాల గుడి, గోల్కొండ, కాకతీయ కోటలు, చార్మినార్ లాంటి ఎన్నో గొప్ప కట్టడాలు ఇక్కడ ఉన్నాయని అన్నారు. మే నెలలో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ సంస్కృతి ప్రతిభింభించేలా నిర్వహించనున్నామని చెప్పారు. మెడికల్ టూరిజంలో తెలంగాణకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. సినిమా, ఆహార రంగాల్లో తెలంగాణకు పెట్టింది పేరని పేర్కొన్నారు.



## రాజకీయ కోణంలో మిస్ వరల్డ్ పోటీలను చూడొద్దు

- సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ నెలవు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహా :** సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ నెలవని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 72వ మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''ఇది చరిత్రాత్మక కార్యక్రమం. కొత్త రాష్ట్రంలో కొత్త కార్యక్రమం జరుగుతోంది. మహిళల ఆత్మ సౌందర్యాన్ని సెలబ్రేట్ చేయడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశం. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పది. రాష్ట్రంలో అన్ని రంగాల వారికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యటక అందాలను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి. దక్షిణ కొరియాలో స్క్విడ్ గేమ్, బీటీఎస్ బ్యాండ్ లాంటివి ఆ దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణకు పేరు ప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తుందని భావిస్తున్నాం. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచస్థాయి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఇది మంచి అవకాశం. రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుంది. అందాల పోటీలను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలి. ప్రభుత్వంపై విమర్శలకు, రాజకీయ కోణంలోనే మిస్ వరల్డ్ పోటీలను చూడటం సరికాదు. 140 దేశాల నుంచి పోటీదారులు వస్తారు. వారితో పాటు దేశ విదేశాలకు చెందిన వేల మంది చేరుకుంటారు. తెలంగాణ గురించి ప్రపంచానికి చెప్పేందుకు ఇది మంచి అవకాశం. ఈ వేదికతో రాష్ట్ర పర్యటక రంగానికి రాబడి పెరుగుతుందని జూపల్లి కృష్ణారావు అన్నారు.

# ప్రజా పాలనకు నిలువుటద్ధం రాష్ట్ర బడ్జెట్

- సమాతూకంగా అభివృద్ధి మరియు సంక్షేమం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా, మహా :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అభివృద్ధిని సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూ, అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో, ప్రజా పాలనకు నిలువుటద్ధంలా రాష్ట్ర బడ్జెట్ ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అనేక సవాళ్ళను ఎదురుకుంటూ ఆర్థిక స్థిరత్వానికి బాటలు వేసేలా 3,04,965 కోట్లతో బడ్జెట్ రూపొందించారని అన్నారు. రైతులకు మహిళలకు లబ్ది చేకూర్చే విధంగా, యువతకు స్వయం ఉపాధి కల్పించేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. ఆరు గ్యారంటీలు మరియు సంక్షేమ పథకాలకు లక్ష కోట్లకు పైన కేటాయించారని, ఎస్సీ సంక్షేమం, గ్రామీణభివృద్ధికి పెద్దపీట వేస్తూ, వ్యవసాయం, పంచాయతీ రాజ్ శాఖ, విద్యా, నీటి పారుదల శాఖలకు భారీగా నిధులు కేటాయించారని తెలిపారు. ముఖ్యంగా దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని భావించి యువతపై ప్రత్యేక ద్రుష్టి సారించి ఎస్సి, ఎస్టీ, బీసీ మైనారిటీ యువతకు ఉపాధి కల్పించడానికి, రాజీవ్ యువ వికాసం పథకంకు అధిక నిధులు కేటాయించారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు దళిత బడుగు బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధికి మార్గ నిర్దేశనం చేసేలా ఈ బడ్జెట్ ఉందని, అభివృద్ధి కొరకు అధిక నిధులు కేటాయించడం వల్ల ఈ బడ్జెట్ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేస్తుందని అన్నారు.



## కాంగ్రెస్ కొత్త కమిటీ ఏర్పాటు

**మోత్కూర్ మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని మండల అధ్యక్షులు, వంగాల సత్యనారాయణ నేతృత్వంలో కొత్త కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఉపాధ్యక్షులు, పైళ్ల సోమిరెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై, నియామక పత్రాలు అందజేశారు. పార్టీ బలోపేతంపై కీలక సూచనలు చేశారు,నూతన మండల కమిటీ,ఉపాధ్యక్షులు, బండ విజయ్ రెడ్డి, పానుగుళ్ళ రవి, ప్రధాన కార్యదర్శులు, జినుకల కనకయ్య, బుశిపాక రమేష్ కార్యదర్శులు,బత్తిని శంకర్, కప్పె వెంకన్న, కోశాధికారి, తీగల నర్సిరెడ్డి, సహాయ కోశాధికారి: కోసన ఉప్పలయ్య, కార్యవర్గ సభ్యులు, చిందాల ఎల్లయ్య, వల్లందాస్ వెంకన్న, మెరుపు నర్సిరెడ్డి, పసునూరి సత్తిరెడ్డి, గ్రామస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి కమిటీ శక్తివంతంగా పని చేయనుంది, రాబోయే ఎన్నికల్లో విజయాన్ని సునిశ్చితం చేయడానికి అంకితభావంతో పనిచేయాలని పైళ్ల సోమిరెడ్డి, అన్నారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం

- ఓటర్ల జాబితా నిరంతర ధృవీకరణ వాటి సమర్పణ..ఎన్నికల పోటీల్లో పాల్గొన్న అభ్యర్థుల ఖర్చుల వివరాలు అందజేయని యెడల ఎలక్షన్ కమీషన్ చర్యలు

**రంగారెడ్డి జిల్లా, మహా :** సమీకృత జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డిఆర్ఓ సంగీతతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా యొక్క నిరంతర ధృవీకరణ, వాటి సమర్పణ, 20.03.2025 నాటికి పెండింగ్‌లో ఉన్న 6,7 & 8 ఫారమ్‌లు, బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం వంటి పలు అంశాలపైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సీఈవో సూచనల మేరకు అసెంబ్లీ స్థానాలల్లో పోలింగ్ కేంద్రాలు, వాటికి కేటయించిన బూత్ లెవెల్ ఆఫీసర్లకు సంబంధించిన వివరాలను వివరించారు. ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేర్‌లింగంపల్లి, చేవేళ్ళ, షాద్ నగర్, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలలోని గ్రామీణ ప్రాంతంలో 1065, పట్టణ ప్రాంతంలో 2436 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. వీటికి మొత్తంగా 3501బూత్ లెవెల్ పోలింగ్ ఆఫీసర్లను ఇంతక ముందు నియమించామన్నారు.



**జిల్లాలోని ఓటర్ల సంఖ్య**

లింగ ప్రాతి పాదికన 20.03.2025 నాటి వరకు మొత్తం 8 నియోజకర్గాల్లో పురుషులు 1889115, స్త్రీలు 1785501, ట్రాన్స్ జెండర్ 434గా ఉండగా మొత్తం ఓటర్లు 36,75,050 ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్నఫాం 6,7,8 ఫారమ్‌లను త్వరగా క్లియర్ చేయడం జరుగుతుందన్నారు.

**గత ఎన్నికలలో అభ్యర్థుల ఖర్చులు**

గత ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చుల వివరాల పెండింగ్ వాటి పై మాట్లాడుతూ ఇప్పటికి ఖర్చుల వివరాలు అందజేయని అభ్యర్థులు త్వరగా అందించాలన్నారు. వివరాలు అందజేయని యెడల ఎలక్షన్ కమీషన్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అదే తరుణంలో రాజకీయ పార్టీల నుండి నియమించాల్సిన బూత్ లెవెల్ ఏజెంట్లను త్వరగా నియమించాలని, వారి వివరాలను ఇఆర్ఓలకు పార్టీ నాయకులు త్వరాగా అందజేయాలని తెలియజేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపియం, సిపిఐ, బిఎస్పి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది పర్వదినాన ప్రతి ఒక్కరికి 6 కేజీల నాణ్యమైన సన్న బియ్యం

### స్వతంత్ర భారత దేశ చరిత్రలో 84 శాతం మందికి ఉచితంగా సన్నబియ్యం పంపిణీ

### రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి





**హుజూర్ నగర్, మహా :** తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం రోజు (మార్చి30) నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి 6 కేజీల సన్నబియ్యం ఉచితంగా ఇస్తామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మఠంపల్లి మండలంలోని మట్టపల్లి గ్రామంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి లతో కలిసి రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి యన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ, ధర్మకర్తలు సాదరంగా స్వాగతం పలికారు. పూజార్లు వేదమంత్రాలతో ఆశీర్వాచనాలు అందజేసి స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం పాంచాంగ శ్రవణం కొరకు స్థల పరిశీలన, సభా ప్రాంగణ ప్రదేశాన్ని, వాహనాలను నిలుపు స్థలాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. తదుపరి మట్టపల్లి ఆర్య వైశ్య సత్రం నందు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి నుండి రాష్ట్రంలోని 84 శాతం జనాభాకి 6 కేజీల నాణ్యమైన సన్న బియ్యం ఇచ్చే పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రేడ్డిని ఆహ్వానించామని తెలిపారు.గతంలో ప్రజలకి ఇచ్చిన దొడ్డు రకం బియ్యం ప్రజలు తినకుండా 5 రూపాయలకే కోళ్లు ఫారం లకి,అమ్మటం జరిగి దుర్వినియోగం అయ్యాయని అందుకే నిరుపేదల ఆకలి తీర్చేందుకు సన్న బియ్యం ఇచ్చి విప్లవాత్మక మార్పు తీసుకరాబోతున్నమని తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఎన్నికైన మొదటి రోజు నుండి ప్రజలకి ఉపయోగపడే విధంగా అద్భుతమైన పరిపాలన అందజేస్తున్నామని తెలిపారు. హుజూర్నగర్ నియోజకవర్గం,కోదాడ నియోజకవర్గం ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని మంత్రి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్టి జోన్ 2 రేంజ్ ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ పి రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాసులు,ఈఓ నవీన్,ఆలయ ధర్మ కర్తలు చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్ కుమార్,అధికారులు, సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వే ఎనిమినేటర్లకు

# ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ వెంటనే చెల్లించండి



**ఉప్పల్,మహా :** ఉప్పల్ సర్కిల్ జిహెచ్ఎంసి ఆఫీస్ దగ్గర అంగన్వాడీ కార్మికులు ధర్నా చేయడం జరిగింది నసమగ్ర కుటుంబ సర్వేలో పనిచేసిన ఎనిమిరేటర్లకు ఇన్సెంటివ్ వెంటనే ఇవ్వాలని లేని పక్షంలో పోరాటానికి సిద్ధమవుతారని ఉప్పల్ జిహెచ్ఎంసి సర్కిల్ ఆఫీస్ దగ్గర అంగన్వాడీలు ఆందోళన,ఉప్పల్ జిహెచ్ఎంసి పరిధిలోని ఎన్యుమరేటర్స్ సమగ్ర కుటుంబ సర్వే చేయించుకుని మూడు నెలలు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం ఇస్తానన్న ఇన్సెంటివ్ అన్యుమురేటర్ల ఖాతాలో చేరలేదు పగలు రాత్రి అని తేడా లేకుండా ఎప్పుడంటే అప్పుడు అధికారులు ఒత్తిడి చేసి మరి సమగ్ర కుటుంబ సర్వే పూర్తి చేయించుకున్నరు కానీ ఇన్సెంటివ్ గురించి అడిగితే మాత్రం మాకు తెలియదు పైనుంచి రాలేదు అని మభ్యపెట్టే మాటలు చెబుతున్నారు అధికారంతో సర్వే చేయించుకున్నప్పుడు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ కూడా ఇప్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది కాబట్టి అధికారులు వెంటనే స్పందించి ఎనిమిది మీటర్లకు రావాల్సిన ఇన్సెంటివ్ ఇప్పించాలని కోరుతూ జిహెచ్ఎంసి ఆఫీస్ దగ్గర ధర్నా చేయటం జరిగింది ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కృష్ణప్రియ శుక్ల నాగమణి పర్జన ప్రేమలత నీరజ కవిత చంద్రకళ సంతోష్ వాణి వనజ వసంత పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు ఈ సందర్భంగా సిఐటియు ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జే వెంకన్న మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్ కమిషనర్ ఆంజనేయులు గారు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని లేనియెడల సిఐటియు అంగన్వాడీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించినారు.



## 25న జిల్లాస్థాయి

# యువజనోత్సవాలు

**ములుగు, మహా :** ములుగు జిల్లాస్థాయి యువ ఉత్సవ కార్యక్రమంలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని నెహ్రూ యువకేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ పిలుపునిచ్చారు. ఏటూరునాగారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న నిర్వహించనున్న జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోస్టర్ ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ యంగ్ రైటర్స్, యంగ్ ఆర్టిస్ట్, ఫోటోగ్రఫీ , ఉపన్యాసం, సంస్కృతిక జానపద నృత్యం( గ్రూప్), సైన్స్ ఎగ్జిబిషన్ ( గ్రూప్ మరియు వ్యక్తిగత) విభాగాలలో పోటీలు జరుగతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంచప్రాన్ అనే అంశము పైన ఈ పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని, గ్రూప్ ఫోక్ డాన్స్ మరియు ఫోటోగ్రఫీ కాంపిటీషన్ లో పంచ్ ప్రాన్ అంశం వర్తించదన్నారు. ఉత్సాహమైన ఫోటోగ్రాఫర్లు తమతమ మొబైల్ ఫోన్లు, కెమెరాలతో పోటీ ప్రదేశంలో ఇచ్చిన థీమ్స్ ని ఫోటోలు తీసి చూపించడం జరుగుతుందని. దానినీ వివరించాల్సి ఉంటుందన్నారు. గ్రూప్ ఫోక్ డాన్స్ లో కనీసం పదిమంది ఉండాలని, సైన్స్ మేల గ్రూప్ లో అత్యధికంగా 5 మంది మాత్రమే కలిగి ఉండాలని సూచించారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి మొదటి, రెండవ,తృతీయ నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించడం జరుగుతుందన్నారు. కావున ములుగు జిల్లాలోని యువజనసంఘాలు, కళాశాల విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9908069469, 9502449469 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

# అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



- మాసబ్ చెరువులో ఆక్రమణలు తొలగిస్తున్న హైడ్రా
- అక్రమాలకు పాల్పడ్డ వారిపై తగు చర్యలు
- ప్రభుత్వ భూములు కబ్జాకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు

**రంగారెడ్డి జిల్లా, మహా :** ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, జిల్లాలోని చెరువుల ఆక్రమణపై గళమెత్తడంతో, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసాబ్ చెరువులో హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో అక్రమార్కులు, ఇష్టానుసారంగా తుర్కయంజాల్ మాసబ్ చెరువులో అక్రమంగా లేఅవుట్లు వేసి జేబులు నింపుకున్నారు. ఇది తెలియని వినియోగదారులు నిర్మాణాలు చేపట్టి ఇల్లు కట్టుకోవడం జరిగింది.

**2020 లో వచ్చిన భారీ వర్షాలకు:**

గతంలో వచ్చిన భారీ వర్షాలకు మాసబ్ చెరువు పూర్తి నీటిమట్టం చేరడంతో చెరువులోనే కొన్ని ఇండ్లు తెలియాడాయి. దీంతో నీట మునిగిన ఇండ్ల యజమానులు ఆవేదనకు లోనయ్యారు. అవినీతి ప్రజా ప్రతినిధుల, అధికారుల అండదండలతో అక్రమాలకు పాల్పడ్డ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎఫ్టిఎల్, బఫర్ జోన్లనే ప్రామాణికంగా ఎంచుకొని ప్లాట్లు చేయడం జరిగింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తెచ్చిన మట్టి వ్యర్థాలను చెరువులో వేయడంతో చెరువు విస్తీర్ణం కుచించుకుపోయింది. రెవెన్యూ ఇరిగేషన్ అధికారులకు స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన నామమాత్రంగా వచ్చి, చెరువులో నిర్మాణాలు చేపట్టిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని మాటల వరకే పరిమితమైందని పలువురు వాపోయారు.

**కదిలిన అధికార యంత్రాంగం:**

రంగారెడ్డి జిల్లాలోని, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువు ఆక్రమణలకు గురై అన్యాక్రాంతమైతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అసెంబ్లీలో మాట్లాడడంతో, హైడ్రా ఎంక్వైరీ అధికారి బాచిరెడ్డి, సిఐ తిరుమలేష్, ఇరిగేషన్ డిఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ వంశీ, ఇబ్రహీంపట్నం ఏసీబీ కెపివి రాజు, ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి, తుర్కయంజాల్ మాసబ్ చెరువు వద్దకు చేరుకొని, అక్రమనకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు చేపట్టారు. చెరువులను, కుంటలను, ప్రభుత్వ భూములను ఎవరైనా ఎంతటి వారైనా కబ్జాలకు, ఆక్రమణలకు పాల్పడినట్లయితే వారిపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని అధికారులు హెచ్చరించారు.

**మాసబ్ చెరువు కోసం ఏకమయ్యాం:**

చెరువుల ఆక్రమణలపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అసెంబ్లీలో చర్చ లేవనెత్తడంతో తుర్కయంజాల్ మాసబ్ చెరువులో హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. చెరువును రెండు ముక్కలు చేసి కబ్జా చేస్తున్నారని గతంలో ఫిర్యాదులు చేయగా, హైడ్రా అధికార యంత్రాంగం ఇచ్చింది. దీంతో అఖిలపక్షం నేతలు హర్షం వ్యక్తం చేశారు. మాసబ్ చెరువు పరిరక్షణ సమితి ఎన్నో ఏళ్లుగా చెరువును కాపాడాలని పార్టీలకతీతంగా ఏకం అయ్యామని తెలిపారు. అవినీతి అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈరోజు మాసబ్ చెరువుకు ఈ దుస్థితి ఏర్పడిందని పలువురు అభిప్రాయపడ్డారు. చెరువు వద్దకు చేరుకున్న హెచ్ఎండిఏ, డిఆర్ఎఫ్ బృందాలు హిటాచీల సాయంతో మట్టి వ్యర్థాలను తొలగిస్తున్నారు.

## కాంగ్రెస్ తోనే

# అన్ని వర్గాలకు న్యాయం

### బీసీలకు 42శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం



**ములుగు, మహా :** కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయమని, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు అసెంబ్లీలో ఆమోదం తెలపడం చారిత్రాత్మకమని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాద శ్యాంరావు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్ ప్రక్రియకు శాసనసభలో ఆమోదం తెలపడంతో ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ (సీతక్క) చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముందుందన్నారు. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే న్యాయం జరుగుతుందన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా పేదల పక్షాన నిలబడడం తమ నైజమని పేర్కొన్నారు. ములుగు జిల్లా అభివృద్ధిలో మంత్రి సీతక్క ఎనలేని కృషి చేస్తోందన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ములుగు జిల్లాను గత పాలకులు ఉపయోగించుకున్నారని, అన్ని జిల్లాలు ఏర్పాటు చేసే సందర్భంలోనూ ములుగు జిల్లాగా ఇవ్వలేదని, మల్లంపల్లి మండలాన్ని సైతం కాంగ్రెస్ హయాంలోనే ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫిషర్మెన్ ప్రధాన కార్యదర్శి గోల్కొండ రవి, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల వెంకటేశ్వర్లు, మల్లంపల్లి మాజీ ఉపసర్పంచ్ చెరుకుపల్లి శ్రీకాంత్, మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు, నాయకులు కొంగరి నరేందర్, రామకృష్ణారెడ్డి, మహ్మద్ ఆఫీద్, చందరాము, ఉప్పు మొగిలి, మాన్ సింగ్, జోష్, ఇంద్ర రాజిరెడ్డి, అనిల్ రెడ్డి, గొర్రె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా రూపకల్పనకు

# పార్టీల సహకారం అవసరం

**ములుగు, మహా :** ఓటరు జాబతా రూపకల్పన, నవీకరణకు రాజకీయ పార్టీల సహకారం అవసరమని డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్.మహేందర్ జీ అన్నారు. గురువారం కలెక్టరేట్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా పరిశుద్ధత చాలా ముఖ్యమైనదని, అర్హులైన ప్రతీ ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిదని సూచించారు. గత ఏడాది నవంబర్ నుంచి ఈనెల 18వరకు కొత్త ఓటరు నమోదుకు ఫారం6 ద్వారా 1,324 దరఖాస్తులు రాగా 1,172 విచారణ పూర్తి చేశామన్నారు. అందులో 152 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఫారం7 కు 290 రాగా 94 విచారణ జరిగిందని 196 పెండింగ్ ఉన్నాయన్నారు. చిరునామా మార్పుకు 1,295 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 1,061 విచారణ పూర్తికాగా 234 పెండింగ్ ఉన్నాయన్నారు. కరెక్షన్స్ కొరకు 1,257 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఇప్పటి వరకు 916 విచారణ పూర్తి




కాగా . 341 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాభితా తయారుకు రిటర్నింగ్ అధికారి ప్రతివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, రెండు ఓట్లున్న ఓటర్లను తొలగించే ప్రక్రియలో రాజకీయ పార్టీలు తమ కార్యకర్తల ద్వారా సరైన ఓటరు వివరాలను అందించేందుకు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, తహశీల్దార్ విజయ భాస్కర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సలీమ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జనరల్ బాడీ సమావేశంలో పాల్గొనండి.!

### పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థులకు ఈవీ శ్రీనివాస్ రావు పిలుపు




**వరంగల్, మహా :** వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం అడ్ హాక్ కమిటీ సభ్యుల సమావేశం సంఘం కన్వీనర్ ఈవీ శ్రీనివాస్ రావు అధ్యక్షతన గురువారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మార్చ్ 23 ఆదివారం రోజున జరిగే జనరల్ బాడీ మీటింగ్ కి పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని, సంఘ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సంఘ అడ్ హాక్ కమిటీ సభ్యులందరికీ దిశానిర్దేశం చేసినట్లు తెలియజేసారు. ఈ సమావేశంలో అడ్ హాక్ కమిటీ సలహాదారులు స్వామి, సభ్యులు మేకల అక్షయ్ కుమార్, సతీష్ రెడ్డి, ఈ శ్రీనివాస్ రావు, ఉమేందర్, దొడ్డిపల్లి కుమార్, రాజు, రజిత, భిక్షపతి, వసంత్, ఆరిఫ్, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులుగా

### నందిపాటి సోమయ్య




**హుజూర్ నగర్, మహా :** వర్ధాపురం అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షులుగా నందిపాటి సోమయ్య ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. మఠంపల్లి మండలం వర్ధాపురం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో భాగంగా బుధవారం రాత్రి గ్రామ దళిత నాయకులు సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు.సమావేశం ముఖ్య ఉద్దేశం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణ కొరకు ఒక కమిటీని ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో ఏర్పాట్లు సజావుగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.దానిలో భాగంగానే నూతన కమిటీ ని ఎన్నుకోవడం జరిగిందని దళిత నాయకులు తెలిపారు.అధ్యక్షులు గా నందిపాటి సోమయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అమరారపు కిషోర్, ఎం.మధు,ప్రధాన కార్యదర్శిగా రెడపంగు కోటేష్, కార్యదర్శి ఆర్ సురేష్, సంయుక్త కార్యదర్శి ఎన్ సునీల్ ,కోశాధికారి అమరారపు పౌలు,సహాయ కోశాధికారి 1 పల్లె. యశ్వంత్ 2 ఆర్ మధు,, సహాయ కార్యదర్శిలు గా అమరారపు రాజేష్ అమరారపు గోపి, కార్యవర్గ సభ్యులు గా ఎం సందీప్, అమరారపు కాశయ్య, పల్లె సునీల్, ఆర్ . విష్ణు,బి.రవి, యన్. మార్క్, యన్. సతీష్, ఏ. పున్నయ్య,,పి.దాసు, యన్.గోపి, లను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బల్దియా లో బడ్జెట్ కౌన్సిల్ సమావేశం

■ బల్దియా పద్దు రూ.1071.48 కోట్ల అంచనా..2025-2026 బల్దియా బడ్జెట్ ఆమోదించిన కౌన్సిల్

పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ కమిషనర్, ఎమ్మెల్యేలు






**వరంగల్, మహా :** గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థకు సంబంధించిన 2025 26 సంవత్సరానికి గాను ముసాయిదా బడ్జెట్ రూ.1071కోట్ల 48 లక్షల అంచనాలను మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన గురువారం పాలక వర్గం ఆమోదించింది. ఈ సమావేశంలో 1/3 కోరం హాజరైన తదుపరి బడ్జెట్ సమావేశం ప్రారంభించగా బల్దియా అకౌంట్స్ అధికారి సరిత బడ్జెట్ అంచనాలను వెల్లడించారు. రూ.1071 కోట్ల 48 లక్షల అంచనాలతో రూపొందించిన బడ్జెట్ కు సభ్యులు ఏకగ్రీవంగా అంగీకారం తెలపడంతో పాలక వర్గం బడ్జెట్ ను ఆమోదించింది. ఇందులో రూ.337 కోట్ల 38 లక్షలు సాధారణ పన్నుల ద్వారా, రూ.728 కోట్ల 10 లక్షలు వివిధ గ్రాంట్ల ద్వారా, రూ 600 కోట్లు డీపాజిట్లు, అడ్వాన్సుల ద్వారా సమకూరుతుందని అంచనా వేశారు

**వరంగల్ అభివృద్ధికి సహకారం మంత్రి కొండా సురేఖ**

వరంగల్ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని, మంత్రి కొండా సురేఖ అన్నారు, సమావేశంలో, ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగరం పై ప్రత్యేక దృష్టి సారించి నగరాన్ని అన్ని విధాలుగా సుందరంగా తీర్చిదిద్దాలనే సదుద్దేశంతో టెక్స్ టైల్ పార్క్ , విమానాశ్రయం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్ట్రాంగ్ వాటర్ డ్రైన్, ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణాలకు శరవేగంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా నగరాభివృద్ధికి అందరు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. మంజూరైన బడ్జెట్ ను పూర్తిగా వినియోగించికొని గ్రేటర్ వరంగల్ లోని అన్ని డివిజన్లలో సమానంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన మేరకు వరంగల్ నగర అభివృద్ధి పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. నగరంలోని ఖాళీ స్థలాలకు పన్ను విధించి,అక్రమ కట్టడాలు జరగకుండా అనుమతి పొంది ఇల్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటే బల్దియా పెరిగే అవకాశం ఉందన్నారు. వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించి వ్యాపారం చేసుకునేలా ఏర్పాటు చేయాలన్నారు. డివిజన్లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశనంలో జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రివర్యులు కొండా సురేఖ, ఎంపి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల సహకారంతో గ్రేటర్ వరంగల్ నగరాన్ని అభివృద్ధి పరిచేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని అందరి సహకారంతో రానున్న రోజుల్లో వరంగల్ నగరాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ నగర అభివృద్ధికి బడ్జెట్ దిక్సూచి అని, ప్రజల పై భారం లేకుండా పాలకవర్గ బడ్జెట్ ను ప్రవేశ పెట్టామన్నారు. వరంగల్ మహా నగర పాలకవర్గం కొలువుదీరిన తర్వాత నాల్గవ సారి బడ్జెట్ ప్రవేశపెడుతున్నామని, నగర ప్రజలకు ఎలాంటి పన్నుల భారం లేకుండా ఈ ఏడాది 202526 ఆర్థిక సంవత్సరం అంచనాలువ్యయాలు సిద్ధం చేయడం జరిగింది. బల్దియా బడ్జెట్ లో వాస్తవాలకు దగ్గరగా ఉండేందుకు కొన్ని సవరణలు జరిగింది. ఈ బడ్జెట్ డివిజన్ల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి సారధ్యంలో వరంగల్ నగర అభివృద్ధికి దీర్ఘకాలికమైన ప్రణాళికలు రచించడం జరుగుతోందని అన్నారు. బల్దియా స్వంత ఆదాయం ద్వారా వచ్చే 337 కోట్ల 38 లక్షల రూపాయలలో 100 కోట్ల రూపాయలు సిబ్బంది జీత భత్యాలు, 29 కోట్ల 92 లక్షల రూపాయలు పారిశుద్ధ్య నిర్వహణకు, 34 కోట్ల 30 లక్షల రూపాయలు విద్యుత్ చెల్లింపులకు, 33 కోట్ల 74 లక్షల రూపాయలు గ్రీన్ బడ్జెట్ కు, 41 కోట్ల 5 లక్షల రూపాయలు ఇంజనీరింగ్ విభాగానికి, 21 కోట్ల 15 లక్షల రూపాయలు సాధారణ నిర్వహణకు, కోటి 40 లక్షల రూపాయలు టౌన్ ప్లానింగ్ కోసం, కోటి 50 లక్షల రూపాయలు డిజాస్టర్ రెస్పాన్స్ కొరకు కేటాయించడం జరిగిందని అన్నారు. విలీన గ్రామాలలో, బలహీనవర్గాలు నివసించే ప్రాంతాలలోని మురికివాడల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 24 కోట్ల 77 లక్షలు , అలాగే ప్రజా సౌకర్యాల కల్పన, పార్కుల అభివృద్ధి, జంతువధ శాలలు, వీధి వ్యాపారులు వెండింగ్ జోన్లు, ఓపెన్ జిమ్ ల ఏర్పాటుకు రూ. 10 కోట్ల 40 లక్షలు, వార్డుల వారిగా అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను రూ. 39 కోట్ల 15 లక్షల రూపాయాలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న 187 కోట్ల రూపాయల స్టాంప్ డ్యూటీ ఫండ్స్ ను ముఖ్యమంత్రి మంజూరు చేయడం వల్ల ఈ సంవత్సరం బడ్జెట్ పెంచడంలో అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ,ఎలక్ట్రికల్ వర్కర్స్ లకు జీతభత్యాలు పెంచడానికి స్లమ్ ఏరియాస్ లో అభివృద్ధికి 1/3 బడ్జెట్ కేటాయించుటకు తోడ్పడిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కుల గణన, ఎస్సీ కుల గణన చేసి అసెంబ్లీలో ఆమోదించినందుకు కౌన్సిల్ పక్షాన మేయర్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భం గా ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యం గా ఉన్నదని బడ్జెట్ కేటాయింపులపై వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్. నాగరాజు , పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి లు, పలువురు కార్పొరేటర్ లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో హన్మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య , జిడబ్ల్యూఎంసి కమిషనర్ అశ్వినీ తానాజీ వాఖేడే, డెప్యుటీ మేయర్ రిజ్వాన శమిమ్ మసూద్, కార్పొరేటర్లు, బల్దియా వింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్ కు ధన్యవాదాలు తెలియజేసిన

ఎమ్మార్పీఎస్ దక్షిణ జిల్లాల అధ్యక్షులు చింత బాబు మాదిగ



**హుజూర్ నగర్,మహా :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నేతృత్వం లో 30 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం మాదిగల అమరవీరుల త్యాగ ఫలితంగా వర్గీకరణ కమిటీ చైర్మన్గా ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేసుకొని ఎస్సీల వర్గీకరణ అమలు చేయాలని నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్ ఆమోదం పొంది శాసన మండలాల్లో తీర్మానం చేసి 18 వ తారీఖున బడ్జెట్ సమావేశాల్లో నీటిపారుదల శాఖ మంత్రి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించినందుకు ఎమ్మార్పీఎస్ దక్షిణ జిల్లాల అధ్యక్షులు చింతా బాబు మాదిగ కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి ఉత్తమ్ కుశాలువా కప్పి బొకే ఇచ్చి వర్గీకరణ అమలైనందుకు కృతజ్ఞతలు తెలియజేసినారు.

## బెట్టింగ్ యాప్స్ ఉపయోగించినా, ప్రమోట్ చేసిన కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ శబరీష్



**ములుగు, మహా :** అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ లకు పాల్పడినా, ఆన్లైన్ గేమింగ్ యాప్ లలో గేమ్స్ ఆడినా, ప్రోత్సాహించిన చట్టరిత్యా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ హెచ్చరించారు. ఈమేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఆన్లైన్ బెట్టింగ్, గేమింగ్ కి అలవాటుపడి యువత ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. సోషల్ మీడియా వేదికగా ఆన్లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్స్ లను ప్రమోట్ చేసేవారి సమాచారం జిల్లా పోలీసులకు అందించాలని కోరారు. యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్ తో సైబర్ మోసగాళ్ళ పన్నిన ఉచ్చులో పడి, డబ్బులు కోల్పోయి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసే ఇన్ఫ్లుఎన్సర్లపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**జిల్లాలో పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు.. : ఎస్పీ**

పదవతరగతి పరీక్షలు ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4వరకు జరుగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ శబరీష్ ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అన్నిరకాల పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ములుగు జిల్లాలోని 8మండలాలలో 21 పరీక్షా కేంద్రాలలో 3,134 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, చుట్టు పక్కల లౌడ్ స్పీకర్లు మూసి వేయాలని సూచించారు. పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 200 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ నందు పొందుపరిచిన విధంగా సమయానికి చేరుకోవాలని, పరీక్ష కేంద్రంలోకి వెళ్లేముందే ప్రధాన గేట్ వద్ద తనిఖీలు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి సహకరించాలని పేర్కొన్నారు.

## మహిళా సాధికారత కు ప్రభుత్వం కృషి

ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్





**జనగామ, మహా :** జనగామ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో గురువారం, టీఎన్జీఓస్ ఆధ్వర్యం లో ఘనంగా ఇఫ్తార్ వేడుకను నిర్వహించారు. ఈ ఇఫ్తార్ వేడుక కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ దంపతులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..**


ఈ నెలాఖరులో రంజాన్, ఉగాది పండగలు ఒకే రోజు వ్యవధిలో ఉన్నందున ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల అమల్లోనే కాకుండా...గవర్నర్, సీఎం పర్యటన కార్యక్రమాలను కూడా విజయవంతంగా పూర్తిచేయడంలో అన్ని శాఖల అధికారులు ఎంతగానో కృషి చేశారన్నారు. ఇటువంటి వేడుకల వల్ల అధికారుల మధ్య స్నేహపూర్వక సత్సంబంధాలు నెలకొంటాయాని తెలిపారు. అదే విధంగా కుటుంబ సభ్యులుగా మెలగడానికి ఇలాంటి వేడుకలు గొప్ప అవకాశమని వెల్లడించారు. ఈ సందర్భంగా మత పెద్ద అబ్దుల్ హఫీజ్, కలెక్టరేట్ ఉద్యోగులతో కలిసి కలెక్టర్ ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవో గోపీరాం, టీఎన్జీఓస్ అధ్యక్షుడు ఖాజా, కలెక్టరేట్ ఏఓ మన్సూర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని పాలడుగు గ్రామాలలో పేరుకు పోయిన ప్రజా సమస్యలను అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేలా కృషి చెయ్యాలని , సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్ కోరారు. సిపిఎం పోరుయాత్రలో భాగంగా మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారి మండల డిప్యూటీ తహిశీల్దార్ ఉపేందర్ గారికి సమస్యలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఆయన పాల్గొని మాట్లాడారు. ఎండాకాలం మొదలైనందున గ్రామంలో నీటి కొరత ఎర్పడకుండా తగిన చర్యలు చేపట్టాలని, ఎర్రగుంటలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ ప్రజలకు ఇబ్బందిగా ఉన్నందున డంపింగ్ యార్డ్ ను మార్చాలని కోరారు. దాదాపు రెండు లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టిన స్మశానా వాటిక, ప్రజలకు నిరూపయోగంగా ఉందని, ప్రజలకు ఉపయోగపడేవిధంగా నిర్మాణం చేపట్టాలని, కోరారు. చెర్వు కత్వకు మరియు కాల్వలకు మరమ్మత్తులు చేపట్టాలని, ప్రజల సౌకర్యార్థం కొత్త గ్రామ పంచాయితీ వద్ద పిల్టర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## ఏసిబి వలలో స్టేషన్ ఘనపూర్ సబ్ రిజిస్ట్రార్



**జనగామ, మహా :** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ విధులు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ ఏసీబీకి చిక్కాడు. స్టేషన్ ఘనపూర్ సబ్ రిజిస్ట్రార్ పర్వతం రామకృష్ణ చిల్పూర్ మండలం వెంకటేశ్వర పల్లె గ్రామానికి చెందిన ఇంటి రిజిస్ట్రేషన్ కు (పార్టీషిపేషన్) సంభందించి 20 వేల రూపాయలు డిమాండ్ చేసి గత వారం రోజులుగా రిజిస్ట్రేషన్ చేయించుకొనే వారిని డాక్యుమెంట్ రైటర్ ను ఇబ్బందులకు గురి చెయ్యగా వారు విసిగి వేసారి చివరకు ఏసీబీ వారిని ఆశ్రయించారు. గురువారం బాధితుల నుండి పర్వతం రామకృష్ణ డబ్బులు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టు పడ్డారు.

## చట్టవ్యతిరేక కార్యకలపాల పై ప్రత్యేక దృష్టి

ముందస్తూ సమాచారం సేకరిండమే మీ లక్ష్యం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్





**హన్మకొండ, మహా :** చట్టవ్యతిరేక కార్యకలపాల పై ముందస్తూ సమాచారాన్ని సేకరించడం స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ప్రధాన కర్తవ్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేశారు. గురువారం వరంగల్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది పోలీస్ కమిషనర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా పోలీసు అధికారులు నిర్వహిస్తున్న విధుల తీరు తెన్నులపై పోలీస్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడతూ క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఖచ్చితమైన సమాచారాన్ని ఖచ్చితమైన సమయానికి అందజేయాలని, స్థానికంగా ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని,రౌడీ షీటర్ల ప్రస్తుత స్థితిగతుల పై ఆరా తీయడం, భూకబ్జా దారులకు పాల్పడే వారి సమాచారాన్ని సేకరించాలని పై తెలిపిన విషయాలలో అధికారులు క్షేత్ర స్థాయిలో ఎక్కువ సమాయాన్ని కేటాయించాలని, భవిష్యత్తులో జరిగే సంఘటనలపై నిఘా వుండాలని తక్కువ మాట్లాడుతూ ఎక్కువ సమాచారాన్ని సేకరించాలని, పాస్‌పోర్ట్ విచారణ త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత మీ పై వుందని అన్నారు. ముఖ్యంగా నీజాయితీగా పనిచేయాలని, ప్రతిభ కబరిచిన వారికి రివార్డు అందజేయ బడుతాయని, వరంగల్ పోలీస్ కమిషనరేట్ కిర్తీ ప్రతిష్టలు స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పైనే అధారపడి వున్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ ఏసిపిలు జితేంద్ రెడ్డి, పార్థసారధి, రాజు, గురుస్వామి,శేకర్, సంజీవ్,చంద్రమోహన్,డి.ఏ.ఓ ఇషాక్‌తో

## సురసంద్రంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**రంగారెడ్డి జిల్లా, మహా :** సురసముద్రంలో గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయింది. ఆమనగల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని సురసముద్రం చెరువులోంచి, వెలికి తీసిన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 3035 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అతని ఒంటి పై కాపీ కలర్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ఉందన్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తు పడితే ఆమనగల్ పోలీస్ స్టేషన్ 8712663340 నెంబరును సంప్రదించాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు






**జనగామ, మహా :** జనగామ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో గురువారం, టీఎన్జీఓస్ ఆధ్వర్యం లో ఘనంగా ఇఫ్తార్ వేడుకను నిర్వహించారు. ఈ ఇఫ్తార్ వేడుక కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ దంపతులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..**

ఈ నెలాఖరులో రంజాన్, ఉగాది పండగలు ఒకే రోజు వ్యవధిలో ఉన్నందున ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల అమల్లోనే కాకుండా...గవర్నర్, సీఎం పర్యటన కార్యక్రమాలను కూడా విజయవంతంగా పూర్తిచేయడంలో అన్ని శాఖల అధికారులు ఎంతగానో కృషి చేశారన్నారు. ఇటువంటి వేడుకల వల్ల అధికారుల మధ్య స్నేహపూర్వక సత్సంబంధాలు నెలకొంటాయాని తెలిపారు. అదే విధంగా కుటుంబ సభ్యులుగా మెలగడానికి ఇలాంటి వేడుకలు గొప్ప అవకాశమని వెల్లడించారు. ఈ సందర్భంగా మత పెద్ద అబ్దుల్ హఫీజ్, కలెక్టరేట్ ఉద్యోగులతో కలిసి కలెక్టర్ ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవో గోపీరాం, టీఎన్జీఓస్ అధ్యక్షుడు ఖాజా, కలెక్టరేట్ ఏఓ మన్సూర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వరస్వామి ఆలయంలో ముగిసిన అగ్నిగుండాలు మహోత్సవం



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అగ్నిగుండాలు మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. బుధవారం రాత్రి 10:00 గంటలకు స్వామివారి శేషవాహనం ఊరేగింపుగా బయలుదేరి పురవీధుల గుండా భక్తులకు దర్శనం ఇచ్చారు. పురవీధుల గుండా స్వామి వారి ఊరేగింపు భక్తుల సందోహరమధ్య సాగింది. ఈ సందర్భంగా భక్తులు పూలు చల్లుతూ, హారతులు సమర్పించారు. శివనామ స్మరణ చేస్తూ, స్వామివారిని కృతజ్ఞతాభావంతో ఆరాధించారు. గురువారం తెల్లవారు జామున 6 :30 గంటల సమయంలో శేష వాహనంపై ఆలయానికి చేరుకున్న స్వామి, ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అగ్నిగుండాలను స్వామివారు, వారితో సేవకులు, భక్తుల నడకతో అగ్నిగుండాల కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. అగ్ని గుండాలు తొక్కుకుంటూ స్వామి ఆలయ ప్రవేశం చేశారు. ఆలయ ప్రవేశానికి ముందు గెలుపు కార్యక్రమం ఘనంగా జరిగింది. స్వామివారి అగ్నిగుండాల తొక్కింపు చూపరులను ఉత్కంఠకు గురిచేసింది. ఈ పవిత్ర ఘట్టాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, తమ భక్తిభావాన్ని ప్రదర్శించారు. ఈ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాలను తాగునీరు, ప్రసాదాల పంపిణీ, చేపట్టారు. పోలీస్ సిబ్బంది భద్రతా చర్యలను తీసుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రు గౌడ్ భక్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, స్వామివారి కృపతో అందరికీ శుభాలు కలగాలని కోరుకున్నారు. ఈ పవిత్ర మహోత్సవంలో పాల్గొన్న భక్తులు స్వామివారి కృపకు పాత్రులవుతూ, తమ జీవితాల్లో స్వామి వారి చూపు ప్రసరించాలని ఆకాంక్షించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పాటిమట్ల గ్రామంలో అర్హులందరికీ గృహాలు అందించి, తెలంగాణ అభివృద్ధికి బాట వేస్తున్నామని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి కుటుంబం సొంత గృహంలో నివసించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ద్వారా వేలాది మంది పేదలకు ఇండ్లు మంజూరు చేయబోతున్నామని తెలిపారు. ఇది కేవలం గృహ నిర్మాణమే కాదు, వారి భవిష్యత్తుకు భరోసా, అని అన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామాన్నారు. ఇందిరమ్మ ఇండ్లతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పానకబండ గ్రామంలో ఇటీవల బిసి కులగణన చేసి విద్యా, ఉపాధి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 29% నుండి 42% రిజర్వేషన్స్, SC వర్గీకరణ బిల్లులు, యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగ యువతకు 3,00000 లక్షలు వరకు రుణాల మంజూరు చేయుటకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంగా పనకబండ గ్రామంలో ఏనుముల రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతగా వారి చిత్ర పటానికి పాలాభిషేకం కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, బత్తిని ధర్మయ్య గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ కారుపోతుల ముత్యాలు, మాజీ సర్పంచ్ సుధగాని పాండు, సీనియర్ నాయకులు లోతుకుంట దేగయ్య, బత్తిని శేఖర్ గౌడ్,కారుపోతుల చంద్రయ్య,లోతుకుంట నాగార్జున, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు, భుషిపాక భూపాల్, ఎమ్మార్పీఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి జగన్,పొన్నెబొయిన యాదగిరి,వల్లందాస్ లచ్చనారి,వల్లందాసు పృద్వి,ఎండీ అచ్చు,మహిళ నాయకురాలు మామిడి కనకతార,ఎండీ మున్ని తదితరులు పాల్గొనటం జరిగింది.

## కాస్తాల శ్రావణ్ కుమార్ ప్రార్థన కూడికలో పాల్గొన్న

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్ నగర్, మహా :** హుజూర్ నగర్ మాజీ మున్సిపల్ కౌన్సిల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కస్తాల శ్రవణ్ కుమార్ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదం లో మృతి చెందగా వారి ప్రార్థన కూడిక ( పెద్దకర్మ ) కార్యక్రమంలో గురువారం మంత్రి పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాలతో ఘనంగా నివాళులర్పించినారు.ఇట్టి కార్యక్రమంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి మీకు అండగా ఉంటామని తెలిపారు.

# రెండు వారాల్లో 50000 బుకింగ్స్

## ఈ స్కూటర్ కోసం ఎగబడుతున్న జనం

అల్ట్రావయొలెట్ టెస్సెరాక్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ ఇండియన్ మార్కెట్లో లాంచ్ అయిన.. రెండు వారాల్లోనే 50,000 బుకింగ్‌లను అందుకుంది. లాంచ్ సమయంలో ప్రకటించిన ధర మొదటి 10000 యూనిట్లకు మాత్రమే పరిమితం అని కంపెనీ వెల్లడించింది. కానీ ఈ ఆఫర్‌ను 50000 బుకింగ్‌లకు పొడిగించింది. మొత్తం బుకింగ్స్ దేశవ్యాప్తంగా ఉన్నాయి.

రెండు వారాల క్రితం షాక్‌వేవ్ ఎలక్ట్రిక్ ఎండ్యూరో బైక్‌తో పాటు అల్ట్రావయొలెట్ టెస్సెరాక్ట్‌ను కూడా లాంచ్ అయింది. లాంచ్ సమయంలో, టెస్సెరాక్ట్‌ను రూ. 1.20 లక్షల ప్రారంభ ధరకు ఆవిష్కరించారు. ఈ ధర మొదటి 10,000 ప్రీ బుకింగ్‌లకు మాత్రమే చెల్లుతుందని బ్రాండ్ వెల్లడించింది. ఈ ప్రకటన తరువాత కేవలం 48 గంటల్లో 20,000 కంటే ఎక్కువ బుకింగ్‌లను పొందింది. దీంతో కంపెనీ ఈ ఆఫర్‌ను మరో 30,000 ప్రీ-బుకింగ్‌లకు విస్తరిస్తున్నట్లు నిర్ణయించింది.

అల్ట్రావయొలెట్ టెస్సెరాక్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ డెలివరీలు 2026 మొదటి త్రైమాసికంలో ప్రారంభమవుతాయి. ఇది ఒక ఫుల్ ఛార్జితో 261 కిమీ రేంజ్ అందిస్తుందని తెలుస్తోంది. కేవలం 100 రూపాయలతో రెండుసార్లు ఛార్జ్ చేయడం ద్వారా 500 కిలోమీటర్ల పరిధిని సాధించగలదని అల్ట్రావయొలెట్ పేర్కొంది.

టెస్సెరాక్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్.. ఆన్‌బోర్డ్ నావిగేషన్‌తో కూడిన 7 ఇంచెస్ టచ్‌స్క్రీన్ TFT ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, రెండు డాష్‌క్యామ్‌లు (ముందు, వెనుక), వైర్‌లెస్ ఛార్జింగ్, హ్యాండిల్‌బార్ కోసం హాప్టిక్ ఫీడ్‌బ్యాక్, డ్యూయల్ ఛానల్ ఏబీఎస్, డ్యూయల్ డిస్క్‌లు, ట్రాక్షన్ కంట్రోల్, హిల్ హోల్డ్, డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్ వంటివి పొందుతుంది.


టెస్సెరాక్ట్ అనేది రాడార్ బేస్డ్ ADAS టెక్నాలజీతో కూడిన భారతదేశపు మొట్టమొదటి స్కూటర్. ఇది బ్లైండ్ స్పాట్ డిటెక్షన్, ఓవర్‌టేక్ అలర్ట్, కొలిజన్ అలర్ట్, లేన్ చేంజ్ అసిస్ట్ వంటి ఫీచర్స్ పొందుతుంది. ఈ స్కూటర్ ఫ్లోటింగ్ డీఆర్ఎల్, ఎల్ఈడీ టెయిల్‌ల్యాంప్‌లతో కూడిన డ్యూయల్ ఎల్ఈడీ ప్రొజెక్టర్ ల్యాంప్ పొందుతుంది. దీని అండర్ సీట్ స్టోరేజ్ 34 లీటర్లు.



# బార్‌క్లేస్ బ్యాంక్ పెట్టుబడులు..

## రూ. 2,300 కోట్లకు రెడీ

**ముంబై:** దేశీ అనుబంధ సంస్థ బార్‌క్లేస్ బ్యాంక్ పీఎల్‌సీ ఇండియాకు బ్రిటిష్ మాతృ సంస్థ బార్‌క్లేస్ బ్యాంక్ రూ. 2,300 కోట్ల మూలధనం సమకూర్చనుంది. తద్వారా బ్యాంక్ బ్యాలన్స్‌షీట్ పటిష్టంకావడంతోపాటు ఇన్వెస్ట్‌మెంట్, ప్రయివేట్ బ్యాంకింగ్‌లో బిజినెస్ విస్తరించేందుకు సహాయపడనుంది. దీంతో మరింతమంది క్లయింట్లకు బ్యాంక్ చేరువకానుంది. ప్రధానంగా కార్పొరేట్, ఫైనాన్షియల్ పెట్టుబడులున్న క్లయింట్లు, అత్యంత సంపన్న వర్గాలలో మరింత విస్తరించనున్నట్లు బార్‌క్లేస్ బ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. వెరసి ప్రపంచంలోనే వేగవంత వృద్ధిలో ఉన్న ఆర్థిక వ్యవస్థపట్ల దీర్ఘకాలిక కట్టుబాటును ప్రదర్శిస్తున్నట్లు తెలియజేసింది.




**బార్‌క్లేస్ ఇండియా ఆర్థిక పరిస్థితి**

ఇండియా రేటింగ్స్ ప్రకారం.. బార్‌క్లేస్ ఇండియా క్యాపిటల్ అడెక్వసీ రేషియో (సీఏఆర్) 2024 మార్చి చివరి నాటికి 15.93 శాతంగా ఉంది. బాసెల్3 మార్గదర్శకాల ప్రకారం బ్యాంకు కనీసం టైర్1 మూలధన నిష్పత్తిని 11 శాతంగా నిర్వహించాలి. 2024 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి భారత్‌లో కంపెనీ ఆస్తులు రూ.53,910 కోట్లుగా ఉన్నాయి. బార్‌క్లేస్ ఇండియా రుణాల్లో ఎక్కువ భాగం టర్మ్ లోన్స్ (2024 ఆర్థిక సంవత్సరంలో 49.2 శాతం), బిల్ డిస్కౌంటింగ్ (35.0 శాతం), వర్కింగ్ క్యాపిటల్ రుణాలు (15.8 శాతం) ఉన్నాయని ఇండియా రేటింగ్స్ తెలిపింది.

# మైక్రోసాఫ్ట్‌లో కీలక మార్పు.. ఉద్యోగులకు లేఖలు

ప్రపంచ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తమ హెచ్‌ఆర్ విభాగంలో కీలక మార్పులు చేసింది. కాథ్లీన్ హొగన్ స్థానంలో అమీ కోల్ మన్‌ను కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్‌గా నియమిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ సత్య నాదెళ్ల నేరుగా ఉద్యోగులకు ఈమెయిల్ లేఖలు పంపించారు. దశాబ్దానికి పైగా మైక్రోసాఫ్ట్ చీఫ్ పీపుల్ ఆఫీసర్‌గా సేవలందించిన హొగన్ "ఆఫీస్ ఆఫ్ స్ట్రాటజీ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్" ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కానున్నారు. నేరుగా సీఈవో సత్య నాదెళ్లకు రిపోర్ట్ చేసే ఈ హోదాను కొత్తగా సృష్టించారు. చీఫ్ పీపుల్ ఆఫీసర్ గా మైక్రోసాఫ్ట్ పై కాథ్లీన్ చూపిన ప్రభావాన్ని అతిశయోక్తిగా చెప్పలేమని సత్య నాదెళ్ల ఉద్యోగులకు పంపిన ఈమెయిల్ లో పేర్కొన్నారు. "గత పదేళ్లకు పైగా ఆమె మన సాంస్కృతిక పరివర్తనకు నాయకత్వం వహించారు. వృద్ధి మనస్తత్వాన్ని స్వీకరించి చురుకుదనంతో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడానికి, ప్రపంచ స్థాయి ప్రతిభను ఆకర్షించడానికి, నిలుపుకోవటానికి ఇది మనకు దోహదపడింది" అంటూ సత్య నాదెళ్ల ప్రశంసించారు. ఇక మైక్రోసాఫ్ట్ లో 25 ఏళ్లకు పైగా పనిచేసిన కోల్‌మన్ ఇటీవల మానవ వనరులు, కార్పొరేట్ ఫంక్షన్లకు కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ గా పనిచేశారు. సత్య నాదెళ్ల ఆమెను "నమ్మకమైన సలహాదారు" అని అభివర్ణించారు. ప్రపంచంలో టాప్ టెక్ కంపెనీలలో ఒకటిగా ఉన్న మైక్రోసాఫ్ట్‌కు ప్రపంచవ్యాప్తంగా సుమారు 2,28,000 మంది ఉద్యోగులు ఉన్నారు. అయితే పనితీరు నిర్వహణ ప్రక్రియను సమీక్ష చేపట్టిన మైక్రోసాఫ్ట్ గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో దాదాపు 2,000 మంది ఉద్యోగులను తొలగించింది.





## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# కోర్టులోనే తేల్చుకుంటా.. దిశ కేసుపై ఆదిత్య ఠాక్రే!

**ముంబై:** ఐదేళ్ల క్రితం చనిపోయిన నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశ సాలియన్ కేసులో ఊహించని మలుపు తిరిగింది. దిశ సాలియన్ ముంబైలోని ఓ భవనం నుంచి పడిపోవడంతో మరణించారు. పోలీసులు ప్రమాదవశాత్తూ సంభవించిన మరణంగా అప్పట్లో కేసు నమోదు చేశారు. తాజాగా శివసేన యూబీటీ ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే, ఇతరులపై కేసు నమోదు చేయాలని దిశ తండ్రి సతీశ్ సాలియన్ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. తన కుమార్తెది ప్రమాదవ శాత్తూ జరిగిన మరణం కాదని, ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టి, హతమార్చారని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై ఆదిత్య ఠాక్రే స్పందించారు. న్యాయ స్థానంలోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు.

**కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే**

దిశ సాలియన్ జూన్8,2020 ముంబైలోని మలాడ్ అనే ప్రాంతానికి చెందిన అపార్ట్‌మెంట్ 14వ ఫ్లోర్ నుంచి కిందపడి చనిపోయారు. విచారణ చేపట్టిన పోలీసులు యాక్సిడెంటల్ డెత్ రిపోర్ట్‌లో(ఏడీఆర్)ప్రమాదవశాత్తూ మరణించినట్లు కేసు నమోదు చేశారు. సరిగ్గా ఆ ఘటన జరిగిన ఆరురోజుల తర్వాత బాంద్రాలోని తన ఫ్లాట్ లో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అనుమానాదాస్పద స్థితిలో మరణించారు.

**దిశ సాలియన్ తండ్రి సంచలన ఆరోపణలు**

దిశ సాలియన్, సుశాంత్ సింగ్ రోజుల వ్యవధిలో ఇద్దరూ అనుమానాస్పదంగా మరణించడంపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ప్రమాదవశాత్తూ పడి చనిపోయినట్లు తేల్చారు. పోలీసుల దర్యాప్తుపై దిశ తండ్రి సైతం సంతృప్తిని వ్యక్తం చేశారు. తమ కుమార్తె మరణంలో ఎలాంటి అనుమానం లేదని, కేసు దర్యాప్తుపై పూర్తిగా సంతృప్తిని వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే అనూహ్యంగా ఐదేళ్ల తర్వాత దిశ సాలియన్ కేసు ఊహించని మలుపు తిరిగింది. గురువారం దిశ తండ్రి సతీష్ సాలియన్ సంచలన ఆరోపణలు చేస్తూ బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

**కింద పడితే ఒక్క దెబ్బకూడా తగల్లేదంట**

ఆ పిటిషన్‌లో జూన్ 8,2020లో దిశ తన ఇంట్లో పార్టీని ఏర్పాటు చేసిందని,ఆ పార్టీకి శివసేన యూబీటీ ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే, అతని బాడీ గార్డ్‌లు, నటులు సూరజ్ పంచోలి,డినో మోరియాలు పాల్గొన్నారని తెలిపారు. పార్టీలో తన కుమార్తె సామూహిక అత్యాచారానికి గురైందని, బలవంతంగా, క్రూరంగా లైంగిక వేధింపులకు గురైంది' అని ఆమె తండ్రి పిటిషన్‌లో పేర్కొన్నారు. అదే సమయంలో పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కిందపడి దిశ చనిపోయిందని చెబుతున్నప్పటికీ ఆమె శరీరంలో ఒక్క ఫ్రాక్చర్ కూడా లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఘటనా స్థలంలో రక్తం లేదని అన్నారు.

### అటాప్సీ రిపోర్ట్‌పై అనుమానం

కేసులో నిందితుల్ని రక్షించేందుకు రాజకీయ పలుకుబడితో దిశ అటాప్సీ రిపోర్ట్‌ను సైతం మార్చారని తెలిపారు. అందుకు ఫోటోగ్రాఫిక్ సాక్ష్యాలే నిదర్శనమన్నారు. నిందితుల్ని కేసు నుంచి భయటపడేసేందుకు రాజకీయ పలుకుబడితో పోలీస్ శాఖ దిశ ప్రమాదవశాత్తూ మరణించారని బలం చేకూరేలా అటాప్సీ రిపోర్ట్‌ను మార్చారని పిటిషన్‌లో వెల్లడించారు. అంతేకాదు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు నాశనం చేయడం, సీసీటీవీ ఫుటేజీలను మార్చడం, పోస్టుమార్టం రిపోర్ట్‌పై ఎలాంటి అనాలసిస్ చేయకుండా హడావిడిగా దహన సంస్కారాలు చేశారని, పొలిటికల్ లీడర్ల ప్రోద్బలంతో పోలీసులు కేసును నీరు గార్చారని చెప్పారు.

# భారత ప్రభుత్వంపై X దావా..

**న్యూఢిల్లీ:** సోషల్ మీడియా దిగ్గజ ప్లాట్‌ఫారమ్ ఎక్స్ భారత ప్రభుత్వంపై సంచలన ఆరోపణలకు దిగింది. చట్టాలకు విరుద్ధంగా తమ కంటెంట్‌ను నియంత్రించాలని చూస్తోందని, ఏకపక్షంగా సెన్సార్‌షిప్‌నకు పాల్పడుతోందని.. ఇది యూజర్ల స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని కోర్టుకెక్కింది. అయితే ఈ పరిణామంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వం తగిన రీతిలో స్పందిస్తుంది.. అలాగే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్ తప్పనిసరిగా చట్టాన్ని గౌరవించాల్సిందే అని కేంద్ర వర్గాలు స్పష్టం చేశాయి. ఇదిలా ఉంటే.. భారత ప్రభుత్వంపై కర్ణాటక హైకోర్టులో ఎక్స్(పూర్వపు ట్విట్టర్) రిట్ పిటిషన్ దాఖలు చేసింది. జస్టిస్ ఎం నాగప్రసన్న బెంచ్ ఈ పిటిషన్‌ను విచారణ జరుపుతోంది. ఐటీ యాక్ట్2000 సెక్షన్ 79(3)(b) ప్రకారం.. కేంద్రం సేఫ్ హార్బర్ (Safe Harbor Provision) అనే నిబంధన తీసుకొచ్చింది. దీని ప్రకారం.. ప్రభుత్వం కోరిన సమాచారాన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్‌లు తప్పనిసరిగా బ్లాక్ చేయడమో లేదంటే తొలగించడమో చేయాల్సి ఉంటుంది. అలా చేయని పక్షంలో సదరు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ న్యాయపరమైన రక్షణ కోల్పోతుంది. అయితే.. ఈ సెక్షన్‌ను సవాల్ చేస్తూ 'ఎక్స్' కర్ణాటక ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. భారతదేశంలో సరైన చట్టపరమైన విధానాలతో కాకుండా.. ఆన్‌లైన్‌లో కంటెంట్‌ను బ్లాక్ చేయడానికి చట్టవిరుద్ధమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారని X ఆ రిట్ పిటిషన్‌లో ఆరోపించింది. కంటెంట్‌ను బ్లాక్ చేసే అంశంపై ఐటీ యాక్ట్‌లోని 69(A) సెక్షన్ స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని, అది ఏయే సందర్భాల్లో అనే అంశంపైనా శ్రేయా సింఘాల్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు(2015లో)ను సైతం ఎక్స్ గుర్తు చేసింది. అయితే.. 69(A) సెక్షన్ కింద కాకుండా.. స్పష్టమైన నిబంధనలు లేని సెక్షన్ 79(3)(b)తో కంటెంట్‌ను నియంత్రించాలని ప్రభుత్వం చూస్తోందని.. ఈ సెక్షన్ ద్వారా కంటెంట్ బ్లాక్ చేసే అధికారం ప్రభుత్వానికి లేదని ఎక్స్ అంటోంది. సాక్ష్యాలుగా 2024 ఫిబ్రవరిలో రైల్వే శాఖ పంపిన 'బ్లాకింగ్ ఆదేశాలను' కోర్టుకు చూపించింది. ఇది తమ వ్యాపార లావాదేవీలను దెబ్బ తీయడమే అవుతుందన్న ఎక్స్.. పైగా ఇలాంటి చర్యలు యూజర్ల స్వేచ్ఛను హరించడం అవుతుందని వాదించింది. అంతేకాదు.. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ నడిపించే సహయోగ్ పోర్ట్‌లో తమను చేరాలంటూ ప్రభుత్వం బలవంతపెడుతోందని ఆరోపించింది. అయితే.. తాము 2021 భారత ప్రభుత్వం తప్పనిసరి చేసిన ఐటీ మార్గదర్శకాలను పాటిస్తున్నామన్న ఎక్స్.. ఇప్పటివరకైతే ప్రభుత్వం తమపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోలేదని కోర్టుకు తెలిపింది.




**శ్రేయా సింఘాల్ కేసులో..**

సోషల్‌మీడియా వేదికల్లో చట్టవిరుద్ధ, ప్రమాదకర కంటెంట్‌ను పోస్ట్ చేసిన వారిని సెక్షన్ 66ఏ కింద అరెస్టు చేసేందుకు వీలుండేది. ఈ సెక్షన్ ప్రకారం.. నిందితులకు మూడేళ్ల వరకు జైలుశిక్ష విధించొచ్చు. అయితే పలు రాష్ట్రాల్లో ఈ సెక్షన్‌ను పోలీసులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. 2015లో దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ విచారణ సందర్భంగా సెక్షన్ 66ఏను రద్దు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

## అక్కడ ఒక్కసారిగా తగ్గిన పెట్రోల్, డీజిల్ ధరలు

గత ఏడాది మార్చిలో పెట్రోల్, డీజిల్ ధరలు రెండు రూపాయలు తగ్గింది. ఆ తరువాత ధరల తగ్గుదల ఊసేలేదు. అయితే ఇప్పుడు ఇంధన ధరలను తగ్గించి, ప్రజలకు కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశ్యంతో మోదీ ప్రభుత్వం ముందడుగు వేసింది. 201920లో పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా రూ.72.69, రూ.65.78 వద్ద ఉండేవి. 202324లో రూ.96.63, రూ. 89.53 వద్దకు చేరాయి. తాజాగా ఈ ధరలను రూ. 94.74, రూ. 87.64 వద్దకు (ఢిల్లీ) తీసుకు వచ్చినట్లు కేంద్ర మంత్రి 'సురేష్ గోపి' పేర్కొన్నారు. దీన్ని బట్టి చూస్తే ఇంధన ధరలు సుమారు రెండు రూపాయల వరకు తగ్గినట్లు తెలుస్తోంది. ఇంధన ధరలు 202122 సమయంలో గరిష్ట స్థాయికి చేరాయి. ఆ తరువాత ప్రభుత్వం నవంబర్ 2021 మే 2022లో పెట్రోల్ & డీజిల్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.13, రూ.16 తగ్గించింది. దీంతో ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ప్రభుత్వం.. ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకున్న వివిధ చర్యల ఫలితంగా ఇంధన ధరలు తగ్గాయని సురేష్ గోపి అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి, ప్రజలకు కొంత ఉపశమనం కలిగించాలంటే.. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వ్యాట్ రేట్లను తగ్గించాలని సురేష్ గోపి సూచించారు. అంతర్జాతీయ ధరల పెరుగుదల నుంచి సామాన్య ప్రజలను రక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అంతే కాకుండా దిగుమతులను తగ్గించి.. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని పెంచడం వంటివి కూడా చేస్తున్నట్లు సురేష్ గోపి వెల్లడించారు.





# నక్సల్స్‌కు అమిత్‌షా వార్నింగ్

**ఢిల్లీ :** కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నక్సల్స్‌కు హెచ్చరికలు జారీ చేశారు. లొంగిపోయేందుకు మావోయిస్ట్‌లకు కేంద్రం అవకాశం ఇస్తుంది. కాదు కూడదు అంటే వారి పట్ల కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. వచ్చేడాది మార్చి నెల లోపు నక్సలిజాన్ని అంతచేస్తామని పునరుద్ఘాటించారు. గురువారం, ఛత్తీస్ ఘడ్ దండకారణ్యంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు జరిపిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్‌లలో 22మంది (అమిత్‌షా ట్విట్ చేసే సమయానికి)మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌పై అమిత్‌షా ఎక్స్ వేదికగా స్పందించారు. 'నక్సల్ భారత్ ముక్త్ అభియాన్' భారత సైనికులు మరో విజయం సాధించారు. ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం బిజాపూర్,కంఖేర్ రెండు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన కూంబింగ్‌లో 22మంది నక్సల్స్ మరణించారు. కేంద్రం నక్సల్స్ లొంగిపోయేందుకు అవకాశం ఇస్తుంది. కాదు కూడదు అంటే.. వారిపట్ల కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోందని హెచ్చరించారు. వచ్చే ఏడాది మార్చి లోపు నక్సల్స్ రహిత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.





## నిర్మాత ఎస్‌కేఎన్‌తో ఇబ్బందేమి లేదు

### బేబీ హీరోయిన్



కొద్ది రోజుల క్రితం ఓ సినిమా ఈవెంట్‌లో బేబీ సినిమా నిర్మాత ఎస్‌కేఎన్ (SKN) తెలుగమ్మాయిలపై చేసిన కామెంట్స్ వివాదస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఇండస్ట్రీలో తెలుగు అమ్మాయిలను ప్రోత్సహిస్తే ఏం అవుతుందో బాగా తెలిసిందని..ఎస్‌కేఎన్ అనడం.. ఆ వాఖ్యలు తన చివరి సినిమా 'బేబీ' హీరోయిన్ వైష్ణవి చైతన్యను ఉద్దేశించే చేశారంటూ బాగా ట్రోల్ చేశారు. ఆ మరుసటి రోజే ఎస్‌కేఎన్ దీనిపై వివరణ ఇస్తూ ఓ వీడియో రిలీజ్ చేశాడు. ఇప్పటికే తాను ఆరుగురు తెలుగమ్మాయిలను హీరోయిన్‌గా మార్చానని.. మరో 25 మందిని కూడా పరిచయం చేస్తానని చెప్పారు. దీంతో ఆ వివాదానికి పుల్‌స్టాప్ పడింది. తాజాగా హీరోయిన్ వైష్ణవి చైతన్య(Vaishnavi Chaitanya) ఈ వివాదంపై స్పందించారు. ఆమె హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం 'జాక్'(Jack). సిద్ధు జొన్నలగడ్డ హీరో. బొమ్మరిల్లు భాస్కర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. తాజాగా ఈ మూవీ నుంచి 'కిస్' (kiss Song) సాంగ్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఎస్‌కేఎన్ కామెంట్స్‌పై వైష్ణవికి ప్రశ్న ఎదురైంది. దీనిపై వైష్ణవి స్పందిస్తూ.. 'ఎస్‌కేఎన్ గారితో నాకు ఇబ్బంది ఉందని ఎవరు చెప్పారు. ఆయనతో నాకు ఎలాంటి సమస్యలు లేవు. ఆయన చేసిన కామెంట్స్ తో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆ వివాదంపై ఆయన ఓ వీడియో కూడా చేసి పెట్టారు. నా పేరు మెన్షన్ చేయనప్పుడు నేనెందుకు స్పందిస్తాను' అని బదులిచ్చింది. అలాగే ఎస్‌కేఎన్ బ్యానర్‌లో చేయాల్సిన సినిమా ఆగిపోవడం గురించి స్పందిస్తూ.. 'బేబీ టీమ్‌తో చేయాల్సిన మూవీ కొన్ని కారణాల వల్ల ఆగిపోయింది. మరో చాన్స్ వస్తే కచ్చితంగా చేస్తాను. ఆ టీమ్‌తో కలిసి పని చేయడం నాకు మంచి అనుభవం' అని చెప్పుకొచ్చింది.



## రెమ్యునరేషన్ మోడల్‌ను మార్చేసిన ఫస్ట్ హీరో మహేష్‌బాబు



స్టార్ హీరోలు ఒక్కో సినిమాకు ఎంత రెమ్యునరేషన్ తీసుకుంటారు అనేది ఇచ్చే నిర్మాతలకు, తీసుకునే హీరోలకు తప్ప ఎవరికీ తెలియదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం వీరి పారితోషికానికి సంబంధించిన గాసిప్స్ చక్కర్లు కొడుతూనే ఉంటాయి. కానీ, సినిమా హిట్ అయితే నిర్మాతకు భారీగానే లాభాలు వస్తాయి. ఒకవేళ నష్టం వస్తే కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ప్రస్తుతం హీరోల అధిక రెమ్యునరేషన్‌లు చిత్ర పరిశ్రమ మనుగడకు ఇబ్బందిగా మారుతోందని పలువురు బహిరంగంగానే కామెంట్ చేస్తున్నారు. అధిక నష్టాల ఎఫెక్ట్ వల్ల కొత్తగా నిర్మాతలు ఎవరూ కూడా సినీ పరిశ్రమలో అడుగుపెట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. రీసెంట్‌గా తీరని నష్టాల వల్ల లైకా ప్రొడక్షన్స్ సంస్థను షట్‌డౌన్ చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. దీనంతటికీ కారణం సినిమా బడ్జెట్ పెరగడమే అని చెప్పవచ్చు. అందులో అధిక భాగం హీరో రెమ్యునరేషన్ అనే ఎక్కువమంది చెబుతున్న మాట. అయితే, ఈ రెమ్యూనరేషన్ మోడల్ మొత్తంగా మహేష్‌బాబు మార్చేశారని ఇండస్ట్రీలో వినిపిస్తోంది. అయితే, అది నిర్మాతలకు భారీ ఊరటను కల్పించేలా ఉండటంతో ప్రిన్స్ మహేష్ బాబును అభినందిస్తున్నారు.

## బెట్టింగ్ యాప్స్ కేసు..


### స్పందించిన విజయ్ దేవరకొండ టీమ్!

బెట్టింగ్ యాప్స్ కేసులో విజయ్ దేవరకొండ పేరు కూడా నమోదైన సంగతి తెలిసిందే. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో విజయ్ దేవరకొండపై కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుపై ఆయనర్ టీమ్ స్పందించింది. బెట్టింగ్ యాప్స్‌కి విజయ్ దేవరకొండ ప్రచారం చేయలేదని.. స్కిల్ బేస్డ్ గేమ్స్‌కు మాత్రమే ప్రమోషన్స్ చేశారని క్లారిటీ ఇచ్చింది. విజయ్ ప్రచారం చేసిన కంపెనీలు అన్ని చట్టప్రకారమే నిర్వహిస్తున్నాయని , ఆన్ లైన్ స్కిల్ బేస్డ్ గేమ్స్ అనుమతి ఉన్న ప్రాంతాలకు మాత్రమే విజయ్ దేవరకొండ ప్రచారకర్తగా పరిమితమయ్యారని పీఆర్ టీమ్ తెలియజేసింది. విజయ్ దేవరకొండ ఏ యాడ్ చేసినా, ఏ కంపెనీకి ప్రచారకర్తగా ఉన్నా ఆ కంపెనీని లీగల్ గా నిర్వహిస్తున్నారా లేదా అనేది ఆయన టీమ్ క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఆ కంపెనీ లేదా ప్రొడక్ట్‌కు చట్టప్రకారం అనుమతి ఉంది అని వెల్లడైన తర్వాతే విజయ్ ఆ యాడ్ కు ప్రచారకర్తగా ఉంటారు. విజయ్ దేవరకొండ అలాంటి అనుమతి ఉన్న ఏ 23 అనే సంస్థకు బ్రాండ్ అంబాసిడర్ గా పనిచేశారు. రమ్మీ స్కిల్ బేస్డ్ గేమ్ అని గతంలో పలుమార్లు గౌరవనీయ సుప్రీం కోర్టు తెలియజేసింది. ఏ 23 అనే కంపెనీతో విజయ్ దేవరకొండ ఒప్పందం గతేడాది ముగిసింది. ఇప్పుడు ఆ సంస్థతో విజయ్ కు ఎలాంటి సంబంధం లేదు. విజయ్ దేవరకొండ విషయంలో పలు మాధ్యమాలలో ప్రసారమవుతున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. విజయ్ ఇల్లీగల్ గా పనిచేస్తున్న ఏ సంస్థకూ ప్రచారకర్తగా వ్యవహరించలేదు' అని ఆయన పీఆర్ టీమ్ పేర్కొంది.



# క్రీడా వార్తలు | SPORTS NEWS





## బీసీసీఐ కీలక నిర్ణయం.. బౌలర్లకు పండగే?


ఐపీఎల్2025కు ముందు భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో బంతులపై లాలాజలం(సలైవా) వాడకంపై నిషేధాన్ని బీసీసీఐ ఎత్తివేసింది. గురువారం(మార్చి 20) జరిగిన కెప్టెన్ల సమావేశం అనంతరం బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ముంబైలో జరిగిన ఈమీట్‌లో ఎక్కువ మంది కెప్టెన్‌లు సలైవా ఉపయోగించాలనే ఆలోచనకు అంగీకరించారు. ఈ ఏడాది సీజన్ నుంచే ఈ రూల్ అమలులోకి రానుంది. కాగా ఇదే విషయంపై బీసీసీఐ పెద్దలు ఇప్పటికే ఐపీఎల్ జట్ల కెప్టెన్‌లతో అంతర్గతంగా చర్చించారు. తుది నిర్ణయం తీసుకోవలసిన బాధ్యత కెప్టెన్లకే బోర్డు విడిచిపెట్టింది. ఇప్పుడు అందుకు కెప్టెన్‌లు కూడా అంగీకరించడంతో బీసీసీఐ తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. "ఇది కెప్టెన్‌లు ఇష్టం. సలైవా వాడకాన్ని వారు కొనసాగించాలనకుంటే, మాకు ఎటువంటి సమస్య లేదు. మేము దానికి అంగీకరిస్తున్నాము. అయితే అంతర్జాతీయ మ్యాచ్‌ల సమయంలో మాత్రం ఐసీసీ రూల్‌కు కట్టుబడి ఉంటాము" అని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

### 2020లో బ్యాన్..

కోవిడ్-19 మహమ్మారి తర్వాత.. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ లాలాజల వాడకాన్ని నిషేధించింది. దీంతో ఫాస్ట్ బౌలర్లు బంతిని రివర్స్ స్వింగ్‌ను చేయడానికి కాస్త ఇబ్బంది పడ్డారు. బంతిపై సలైవా ఉపయోగించితే అది ఎక్కువగా రివర్స్ స్వింగ్ అవుతుంది. ఐపీఎల్(2020)లో సైతం బీసీసీఐ సైతం లాలాజల వాడకంపై బ్యాన్ విధించింది. అప్పటి నుంచి గతసీజన్ వరకు ఏ ఫాస్ట్ బౌలర్, ఏ ప్లేయర్ కూడా సలైవాను ఉపయోగించలేదు. తాజాగా ఇదే విషయంపై భారత ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ కూడా స్పందించాడు. లాలాజల వాడకంపై బ్యాన్‌ను ఎత్తివేయాలని ఐసీసీని షమీ అభ్యర్థించాడు "మేము రివర్స్ స్వింగ్ చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాము. కానీ సలైవాను మాత్రం ఉపయోగించడం లేదు. మ్యాచ్ జరిగే సమయంలో సలైవా వాడకాన్ని అనుమతించమని మేము చాలా సార్లు ఐసీసీకి విజ్ఞప్తి చేశాము. అందుకు అనుమతి ఇస్తే బంతి మరింత ఎక్కువగా రివర్స్ సింగ్ అయ్యే అవకాశముంటుంది" అని ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా విలేకరుల సమావేశంలో షమీ పేర్కొన్నాడు. కాగా ఐపీఎల్-2025 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి.

## ఐపీఎల్‌లో కొత్త రూల్.. ఇక టాస్‌తో డోంట్ వర్రీ

ఐపీఎల్ 2025 సీజన్‌కు మరో రెండు రోజుల్లో తెరలేవనుంది. మార్చి 22 నుంచి ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ మెగా ఈవెంట్ షూరూ కానుంది. ఈ టోర్నీ ఆరంభానికి ముందు బీసీసీఐ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఐపీఎల్‌లో సాయంత్రం వేళ జరిగే మ్యాచ్‌ల్లో రెండో ఇన్నింగ్స్‌లో రెండు బంతులను వినియోగించుకునే అవకాశాన్ని బీసీసీఐ కల్పించింది. గురువారం(మార్చి 20) ముంబైలో జరిగిన కెప్టెన్ల సమావేశంలో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. కాగా ఐపీఎల్‌లో సాయంత్రం జరిగే మ్యాచ్‌లలో మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. డ్యూ ఫాక్టర్ కారణంగా రెండో ఇన్నింగ్స్‌లో బంతి తడిగా మారి బౌలర్లకు గ్రిప్ దొరికేది కాదు. దీంతో బౌలర్లు సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బంతులు వేయలేక పరుగులు సమర్పించుకునేవారు. చాలా మ్యాచ్‌ల్లో మంచునే ఎక్స్ ఫ్యాక్టర్‌గా మారేది. అందుకే ప్రతీ జట్టు టాస్ గెలిస్తే తొలుత బౌలింగ్ ఎంచుకునేందుక మొగ్గు చూపేవారు. ఈ క్రమంలోనే డ్యూ ఫాక్టర్‌ను తగ్గించడానికి రెండు కొత్త బంతుల రూల్‌ను బీసీసీఐ తీసుకొచ్చింది. ఈ రూల్ ప్రకారం.. రెండో కొత్త బంతిని సెకెండ్ ఇన్నింగ్స్‌లో మాత్రం ఉపయోగించాలి. అది కూడా 11వ ఓవర్ తర్వాత మాత్రమే జట్ల కెప్టెన్లు కొత్త బంతిని తీసుకునే అవకాశముంటుంది. అయితే బంతిని మార్చాలా వద్దా అనే దానిపై తుది నిర్ణయం అంపైర్‌దే. మంచు ఎక్కువగా ఉందా లేదా అని పరిశీలించి అంపైర్ తుది నిర్ణయం తీసుకుంటారు. మధ్యాహ్నం జరిగే మ్యాచ్‌లకు ఈ రూల్ వర్తించదు. ఈ నిర్ణయంతో బౌలర్లకు ప్రయోజనం చేకూరనుంది. అదేవిధంగా ఇంపాక్ట్ రూల్‌ను కొనసాగించేందుకు బీసీసీఐ మొగ్గు చూపింది. ఐపీఎల్ 2023 సీజన్‌లో ప్రవేశిపెట్టిన ఈ రూల్ పట్ల మొత్తం పది మంది కెప్టెన్లు కూడా సముఖత చూపినట్లు తెలుస్తోంది. మరోవైపు సలైవా బ్యాన్‌ను కూడా బీసీసీఐ ఎత్తివేసింది.



## కొత్త వ్యూహంతో.. అక్షర్‌పై ఆశలతో ఢిల్లీ క్యాపిటల్స్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL)లో ఒక్కసారి కూడా టైటిల్ సాధించలేకపోయిన అతి కొద్ది జట్లలో ఢిల్లీ క్యాపిటల్స్ (Delhi Capitals) ఒకటి. గత సీజన్లో వరుసగా పరాజయ పరంపరతో ప్రారంభించి మొదటి అయిదు మ్యాచ్ లలో నాలుగింటిలో ఓటమి చవిచూసి.. చివరికి ఆరో స్థానంతో ముగించింది ఢిల్లీ. అయితే, ఈసారి జట్టు స్వరూపాన్నే మార్చేసింది. గత సీజన్ కెప్టెన్ భారత్ జట్టు వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ (Rishabh Pant)ను రికార్డు స్థాయిలో రూ 27 కోట్లకు లక్నో సూపర్ జెయింట్స్ కనుగోలు చేసిన తర్వాత కొత్త వ్యూహానికి తెరతీసింది. అనుభవజ్ఞుడైన భారత్ వికెట్ కీపర్ బ్యాటర్ కెఎల్ రాహుల్ (KL Rahul), దక్షిణాఫ్రికా వెటరన్ ఆటగాడు ఫాఫ్ డు ప్లెసిస్ వంటి సీనియర్లను కొనుగోలు చేసింది. కానీ గతంలో పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్‌కి కెప్టెన్ గా వ్యవహరించిన కెఎల్ రాహుల్ ఢిల్లీ పగ్గాలు చేపట్టేందుకు అంత ఆసక్తి చూపించకపోవడంతో ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీ లో రాణించిన మరో యువ ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ కి నాయకత్వ బాధ్యతలు అప్పగించారు.

**ఢిల్లీ క్యాపిటల్స్ మేనేజ్‌మెంట్‌లోనూ మార్పులు**

ఢిల్లీ బ్యాక్‌రూమ్ సిబ్బందిలో కూడా మార్పులు చేశారు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ స్థానంలో భారత్ మాజీ ఆల్ రౌండర్ హేమాంగ్ బదానీని ప్రధాన కోచ్‌గా నియమించారు. భారత మాజీ బ్యాటర్ విశాఖపట్నంకి చెందిన వై వేణు గోపాలరావు కొత్త క్రికెట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఇంగ్లండ్ మాజీ ఆటగాడు కెవిన్ పీటర్సన్‌ను మెంటార్‌గా, మాథ్యూ మోట్‌ను అసిస్టెంట్ కోచ్‌గా, మునాఫ్ పటేల్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించారు.



**సీనియర్లకు మళ్ళీ జట్టులో చోటు**

అయితే ఢిల్లీ జట్టులో చాలా మంది గత సీజన్ ఆటగాళ్లు మళ్లీ జట్టు లో కొనసాగుతున్నారు. గత సీజన్ లో ప్రాతినిధ్యం వహించిన అక్షర్ పటేల్ , కుల్దీప్ యాదవ్, ట్రిస్టన్ స్టబ్స్, అభిషేక్ పోరెల్‌లను రెటైన్ చేసారు. వేలంలో ఆస్ట్రేలియా బ్యాటర్ జేక్ ఫ్రేజర్‌మెక్‌గుర్క్‌ను తిరిగి కొనుగోలు చేశారు. పేసర్ ముఖేష్ కుమార్ కూడా గత సీజన్ లో ఢిల్లీ తరపున ఆడాడు. దేశవాళీ క్రికెట్ లో అద్భుతంగా రాణించిన కరుణ్ నాయర్ కూడా గతంలో ఈ ఫ్రాంచైజీ తరపున ఆడారు. గత సీజన్‌లో తమ ఫాస్ట్ బౌలింగ్ యూనిట్‌తో ఢిల్లీ సమస్యలను ఎదుర్కొంది. ఈ కారణంగా బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేశారు. ఆస్ట్రేలియా కి చెందిన సీనియర్ పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్ (రూ 11.75 కోట్లు), టి నటరాజన్ (రూ 10.75 కోట్లు), ముఖేష్ కుమార్ (రూ 8 కోట్లు) , మోహిత్ శర్మ (రూ 2.20 కోట్లు)లను తీసుకువచ్చారు. ఇక స్పిన్ విభాగం లో కుల్దీప్ మరియు అక్షర్ పటేల్ ఉన్నారు. ఇంగ్లండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ జట్టు నుంచి తప్పుకోవడం ఢిల్లీ క్యాపిటల్స్ ని కొంత దెబ్బతీసింది. అయితే ఢిల్లీ కొత్త జట్టు కొత్త కెప్టెన్, కొత్త వ్యూహం తో ఈసారి రంగ ప్రవేశం చేస్తోంది. అక్షర్ పటేల్ నేతృత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ మార్చి 24 (సోమవారం)న విశాఖపట్నంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏవిడిసిఏ క్రికెట్ స్టేడియంలో రిషబ్ పంత్ నాయకత్వంలోని లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగే మ్యాచ్ తో తమ ఐపీఎల్ 2025 సీజన్ని ప్రారంభిస్తుంది.

**ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు లో ప్రధాన ఆటగాళ్ళు**

ఆస్ట్రేలియా కి చెందిన జేక్ ఫ్రేజర్‌మెక్‌గుర్క్ 2023 నుండి టీ20లలో పవర్‌ప్లేలో అత్యధిక స్ట్రైక్ రేట్ (168.04) ఉన్న బ్యాటర్లలో ట్రావిస్ హెడ్ (184.8), అభిషేక్ శర్మ (181.47)ల తర్వాత మూడో స్థానం లో ఉన్నాడు. 21 ఏళ్ల ఈ యువ బ్యాటర్ 2024లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున 234.04 స్ట్రైక్ రేట్‌తో 330 పరుగులు సాధించాడు. ఈ కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్ మరోసారి అతడిని కొనుగోలు చేసింది.

**కెఎల్ రాహుల్**

మాజీ లక్నో కెప్టెన్ కెఎల్ రాహుల్ ఇటీవల ఛాంపియన్ ట్రోఫీ లో తన అసాధారణ ప్రతిభతో భారత్ జట్టుకి విజయాలు చేకూర్చి ప్రశంసలు అందుకున్నాడు. ఈ సీజన్‌లో రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఓపెనింగ్ చేయనున్నాడు. ఐపీఎల్ లో బాగా నిలకడ రాణిస్తున్న బ్యాటర్లలో ఒకడిగా పేరు పొందిన రాహుల్ 132 మ్యాచ్‌లు ఆడి 135 స్ట్రైక్ రేట్‌తో 37 అర్ధ సెంచరీలు, నాలుగు సెంచరీలతో 4,683 పరుగులు సాధించాడు.

**ఫాఫ్ డు ప్లెసిస్**

అపార అనుభవం ఉన్న ఈ దక్షిణాఫ్రికా వెటరన్ ఆటగాడు ఈ సీజన్ లో ఓపెనర్ గాను, ఢిల్లీ క్యాపిటల్స్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఫాఫ్ 145 ఐపీఎల్ మ్యాచ్‌లలో ఆడాడు. 140 స్ట్రైక్ రేట్‌తో 37 అర్ధ సెంచరీ లతో 4571 పరుగులు చేశాడు.

**కరుణ్ నాయర్**

దేశవాళీ క్రికెట్ లో సెంచరీలతో రికార్డుల మోత మోగించిన కరుణ్ నాయర్ మళ్ళీ ఐపీఎల్ లో ఢిల్లీ తరపున రంగ ప్రవేశం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. విదర్భ రంజీ ట్రోఫీ విజయంలో కరుణ్ నాయర్ కీలక పాత్ర పోషించాడు. ఫైనల్స్‌లో 120 , 80 పరుగులు చేశాడు. విజయ్ హాజారే ట్రోఫీలో కరుణ్ నాయర్ ఎనిమిది మ్యాచ్‌ల్లో 700 కంటే ఎక్కువ పరుగులు సాధించాడు. 76 ఐపీఎల్ మ్యాచ్‌లతో, దాదాపు 130 స్ట్రైక్ రేట్‌తో 10 అర్ధ సెంచరీలతో 1,496 పరుగులు చేశాడు. మిడిల్ ఆర్డర్‌లో అతని స్థిరత్వం ఢిల్లీ కి కీలకం.

**అక్షర్ పటేల్**

కొత్త కెప్టెన్ గా బాధ్యతలు చేపట్టిన అక్షర్ పటేల్ తన జట్టును ఫైనల్స్‌కు తీసుకెళ్లాలని పట్టుదలతో ఉన్నాడు. ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీ లో భారత్ తరపున బ్యాటింగ్ లోనూ, బౌలింగ్ లోనూ రాణించిన అక్షర్ పటేల్ కి కెప్టెన్ గా పెద్ద అనుభవం లేదు. అయితే తన నైపుణ్యంతో రాణించగల సామర్థ్యముంది. అక్షర్ ఇంతవరకు 150 ఐపీఎల్ మ్యాచ్‌లలో, 130 స్ట్రైక్ రేట్‌తో మూడు అర్ధ సెంచరీలతో 1,653 పరుగులు చేశాడు. 8 కంటే తక్కువ ఎకానమీతో 123 వికెట్లతో సాధించిన అక్షర్ జట్టుకు సరైన సమతుల్యతను ఇస్తాడనడంలో సందేహం లేదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com



# రాష్ట్ర బడ్జెట్లో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

## రాష్ట్ర ఐటీ,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**కాటారం, మహా :** శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో మైనార్టీల సంక్షేమం కోసం భారీగా నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేసినట్టు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. గురువారం కాటారంలో ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరఫున ఇచ్చిన ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథిగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ ప్రవీణ్ కరే,కాటారం సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్ పాల్గొన్నారు. ప్రభుత్వ హయాంలో మైనార్టీల సంక్షేమానికి భారీగా నిధులు కేటాయిస్తున్నా మని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ను మైనార్టీలకు అమలు చేస్తామని , ఇల్లు లేని వారికి గృహాలు మంజూరు చేస్తూ కలిసే సౌకర్యాలు కల్పిస్తామని శ్రీధర్ బాబు అన్నారు. గ్రామాలలో మసీదుల నిర్మాణంతో పాటు ముస్లిం సోదరుల సమస్యలను పరిష్కరించే విధంగా ముందుకు వెళ్తామని మంత్రి అన్నారు. రాష్ట్ర ,జిల్లా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంజాన్ మాసం త్యాగం, సహనానికి ప్రతీక అని, సమాజంలో ఐక్యత, ప్రేమ, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే పర్వదినమని తెలిపారు. ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రాష్ట్రంలోని ముస్లిం సోదరుల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని అన్నారు. నియోజకవర్గం లోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రి శ్రీధర్ బాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, కాటారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమునూరు ప్రభాకర్ రెడ్డి ,మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య నాయకులు ఐరినేని నవీన్ రావు, ఓన్న వంశవర్ధన్ రావు, చల్లా జక్కిరెడ్డి,కుంభం రమేష్ రెడ్డి, కొట్టే శ్రీహరి, కడారి విక్రమ్, తాజా మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి అజీజ్, ఎం డి చోటే మియా, దాదామియా ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# నిట్ డైరెక్టర్ ను మర్యాదపూర్వకం కలిసిన సీపీ



**హన్మకొండ, మహా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన సన్ ప్రీత్ సింగ్ కాజీపేట ఎన్.ఐ.టి డైరెక్టర్ బైద్యధర్ సుబుధి ని గురువారం నిట్ కళాశాల లో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం దేశ, విదేశాల నుండి విద్యను అభ్యసించేందుకు ఇక్కడికి వచ్చే విద్యార్థుల కోసం కల్పిస్తున్న మౌలిక సదుపాయల కల్పన, అలాగే ర్యాగింగ్ నియంత్రణకై కళాశాల పరంగా తీసుకుంటున్న ముందస్తూ చర్యలతో పాటు పోలీస్ పరంగా అందిస్తున్న సహకారంపై కూడా డైరెక్టర్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. పోలీస్ కమిషనర్ వెంట స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, కాజిపేట్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఎస్.ఐ లవణ్ కుమార్, ఉన్నారు.

# పండ్ల మార్కెట్ ను మోడల్ మార్కెట్ గా తీర్చిదిద్దుతాం

## రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మాత్యులు కొండా సురేఖ



**వరంగల్, మహా:** వరంగల్ ఏనుమాముల మార్కెట్ పరిధిలో గల ముసలమ్మ కుంటలో పది ఎకరాల విశాలమైన విస్తీర్ణ స్థలంలో గురువారం ఏర్పాటుచేసిన పండ్ల మార్కెట్ను వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద లతో కలసి మంత్రి ప్రారంభించారు. మార్కెట్లో మామిడికాయల వేలం వేసి మంత్రి ఎమ్మెల్యే, కలెక్టర్లు వేలం ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్దది ఏనుమాముల మార్కెట్ అని, ఈ మార్కెట్ కు ఆనుకొని ప్రత్యేకంగా పండ్ల క్రయవిక్రయాల కొరకు ప్రభుత్వం కేటాయించిన పది ఎకరాల స్థలంలో ప్రారంభించుకోవడం జరిగిందని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సహకారంతో అవసరమైన అన్ని సౌకర్యాలు ఉండే విధంగా మోడల్ మార్కెట్ గా తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుండి నిధులుగా మంజూరుకి కృషి చేస్తామని మంత్రి తెలిపారు. మార్కెట్కు వచ్చే రైతుల సౌకర్యార్థం కనీస వసతులు కల్పించుటకు తన నిధుల నుండి 20 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మార్కెట్కు చేరుకోవడానికి జి డబ్ల్యూఎంసి ద్వారా రోడ్డు వేయిస్తామన్నారు. ఈ మార్కెట్ ఏర్పాటు వల్ల ఇతర రాష్ట్రాల నుండి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేయడం వల్ల రైతులు పండించిన మామిడి పంటకు మంచి ధర పొందే అవకాశం ఉందన్నారు. మామిడికాయ వ్యాపార లావాదేవీలకు స్థలం లేక పోవడం వల్ల గత నాలుగు సంవత్సరాలుగా ప్రైవేట్ స్థలంలో నిర్వహిస్తున్నారని, వరంగల్ జిల్లా నుండే కాకుండా పరిసర జిల్లాలైన ఖమ్మం సత్తుపల్లి కరీంనగర్ చిత్తూర్ జగిత్యాల సూర్యాపేట జిల్లాల నుండి మామిడి పండ్లు విక్రయించుటకు వచ్చే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండడంతోపాటు ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. కార్మికుల అవసరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వారికి మార్కెట్లో కనీస సౌకర్యాలు వెంటనే కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వాట్సాప్ గ్రూప్ గ్రూప్ ద్వారా వ్యవసాయనాలు లేకుండా పండ్లను పండించడంపై సూచనలు చేయడం పట్ల కలెక్టర్ ను అభినందించారు. లాభాలకు బదులుగా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్గానిక్ పండ్లను పండించాలని మంత్రి కోరారు. ప్రణాళికబద్ధంగా మార్కెట్ ను అభివృద్ధి చేయుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి నుండి నిధులు మంజూరు చేయిస్తామని మంత్రి తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రత్యేకంగా పండ్ల కొరకు ఏర్పాటు చేసిన హోల్సేల్ మార్కెట్లో ప్రణాళిక బద్ధంగా పోలీస్ స్టోరేజ్ మంచినీటి సౌకర్యం గోడౌన్ క్యాంటీన్ విద్యుద్దీకరణ ఏర్పాటు చేయుటకు గాను మార్కెటింగ్ ఉద్యానవవనాల శాఖల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. ఈ సందర్భంగా అధిక మామిడి పంట పండించిన రైతులకు మంత్రి ఎమ్మెల్యే కలెక్టర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వ్యవసాయ శాఖ శ్రీనివాస్ , డిప్యూటీ డైరెక్టర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సురేఖ, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సంగీతలక్ష్మి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రవీందర్రావు, ఫ్రూట్ మర్చంట్ ప్రెసిడెంట్ వెల్ది సాంబయ్య, ట్రేడర్స్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మన అగ్రిటెక్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్

- డ్రోన్ మేళా కార్యక్రమం ద్వారా రైతులకు మేలు
- మన అగ్రిటెక్ సంస్థ ఎండి ని అభినందించిన కలెక్టర్



**వరంగల్, మహా :** వరంగల్ ఎనమాముల మార్కెట్ లో ఆధునిక వ్యవసాయ పరికరాలతో రైతాంగానికి ఎన్నో సేవలు అందిస్తున్న మన అగ్రిటెక్ సంస్థ ను గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద సందర్శించారు. మన అగ్రిటెక్ లో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రోన్ స్ప్రేయర్ ను కలెక్టర్ సత్య శారద, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యి డ్రోన్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మన అగ్రిటెక్ లో ఏర్పాటు చేసిన ఒక్కో స్టాల్స్ ను కలెక్టర్ ఎంతో శ్రద్ధగా వీక్షించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత పాషికంటి రమేష్ స్టాల్స్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక పరికరాలను కలెక్టర్ కు క్షుణ్ణంగా వివరించారు. నూతనంగా ఆవిష్కరించిన డ్రోన్ ప్రత్యేక తలను వివరిస్తూ ఆధునిక వ్యవసాయంలో రైతులకు మన అగ్రిటెక్ ద్వారా గత 8 సంవత్సరాలుగా అందిస్తున్న సేవలను ఛాయాచిత్రాల ద్వారా కలెక్టర్ కు వివరించారు. మునుముందు కూడా తాము అందిస్తున్న ఆధునిక వ్యవసాయ పరికరాలకు రైతులకు కావాల్సిన సబ్సిడీ కల్పించి తోడ్పాటును అందిచాలని మన అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేష్ కలెక్టర్ ను కోరారు. రైతులకు కావాల్సిన సబ్సిడీ విషయంలో కలెక్టర్ సానుకూలంగా స్పందించారని సంస్థ అది నేత తెలిపారు. రైతంగానికి మన అగ్రిటెక్ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను కలెక్టర్ సంస్థ అధినేత రమేష్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎనమాముల మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి,ఛాంబర్ ఆఫ్ కామర్స్ పెద్దలు,మార్కెట్ ప్రతినిధులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వన్ నేషన్ ,వన్ ఎలక్షన్ విధానం 1967లోనే ఉంది


- దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికతో అనేక ప్రయోజనాలు
- దేశ భవిష్యత్తు కోసం నేడు జమిలి ఎన్నికలే శ్రేయస్కరం
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**కరీంనగర్, మహా :** వన్ నేషన్ , వన్ ఎలక్షన్ విధానం (జమిలి ఎన్నికల) 1967 లోనే ఉందని , ఆ రోజున దేశవ్యాప్తంగా లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయని , జమిలి ఎన్నిక విధానం కొత్తేమీ కాదని , ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భవిష్యత్తు కోసం జమిలి ఎన్నికలే శ్రేయస్కరమని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం రోజున జమ్మికుంట బిజెపి శాఖ ఆధ్వర్యంలో వన్ నేషన్ , వన్ ఎలక్షన్ వర్క్ షాప్ ప్రోగ్రాం జరిగింది. ఈ వర్క్ షాప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వన్ నేషన్ , వన్ ఎలక్షన్ తో ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులు వస్తాయని , లోక్ సభ, అసెంబ్లీలకు కలిపి దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే భారీగా ప్రభుత్వ ధన వృధా ఖర్చులుతగ్గుతాయన్నారు.కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే సమయం ఆదాతో పాటు పదేపదే పలుమార్లు ఎన్నికలు జరగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలకు తరుచూ ఎన్నికల కోడ్ అడ్డంగా మారడం కూడా తగ్గుతుందన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఓటర్ల పోలింగ్ శాతం కూడా గణనీయంగా పెరుగుతుందన్నారు. ముఖ్యంగా స్వాతంత్రం వచ్చిన తర్వాత 1967 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు, లోక్ సభకు ఒకేసారి ఎన్నికలు జరిగేవని, ఆ తర్వాత కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలు రద్దు కావడం, 1970 లో ఏడాది ముందే లోక్ సభ రద్దు చేయడంతో ఈ విధానం మారిపోయిందన్నారు. 1983లో ఎన్నికల కమిషన్ మరోసారి జమిలి ఎన్నికల ప్రతిపాదనను తెరపైకి తెచ్చిందని , 1999లో లా కమిషన్ నివేదిక ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని లేవనెత్తిన అది ఆచరణలోకి రాలేదన్నారు. రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్ సభ ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా ఖర్చులు చేస్తుందని , వేర్వేరు సమయాల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల జరుగుతున్న భారీ ఖర్చులను అరికట్టడానికి, ప్రజా ధనాన్ని వృధా కాకుండా, ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులు చేపట్టడానికి జమిలి ఎన్నికలను తీసుకురావాల్సిన అవసరం ఉందని మోడీ ప్రభుత్వం భావించిందన్నారు. ఆదిశగానే 2016 లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జమిలి ఎన్నికల ఆలోచనలను ప్రతిపాదించగా, దీనిపై 2017లో నీతి ఆయోగ్ కసరత్తు చేసిందన్నారు. 2022 డిసెంబర్లో జెమిని ఎన్నికలపై లా కమిషన్ వివిధ పార్టీలు, ఈసీ, అధికారులు ,విద్యావేత్తలు, నిపుణుల, అభిప్రాయాలను ఆహ్వానించిందన్నారు. ఆ తదనంతరం కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని కూడా ఏర్పాటు చేసిందన్నారు. దీనిపై కమిటీ కేంద్ర ప్రభుత్వానికి నివేదిక కూడా అందజేసిందన్నారు. ప్రధానంగా ఈ నివేదికలో లోక్సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలు, చట్టపరమైన మార్పులను సూచించిందని , అలాగే ఈ జమిలి ఎన్నికల విధానం ద్వారా ఎన్నికల నిర్వహణ ఖర్చులు తగ్గించి, అభివృద్ధి, సామాజిక ఐక్యతను పెంపొందించవచ్చని కమిటీ పేర్కొందన్నారు. కమిటీ నివేదికను కేంద్ర కేబినెట్ ఆమోదించిందని తెలిపారు. ఈ ప్రతిపాదన చట్టంగా మారితే, లోక్సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయని, . అనంతరం 100 రోజుల్లోగా నగర, పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే యోచన ఉంద న్నారు.కమిటీ సిఫార్సులను అమలు చేయడానికి పార్లమెంట్ ఆమోదంతో పాటు, కొన్ని రాజ్యాంగ సవరణలకు రాష్ట్రాల అసెంబ్లీలు కూడా ఆమోదం తెలపాలని, ఈ ప్రతిపాదనపై రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, కొన్ని పార్టీలు జమిలి, ఎన్నికలపై మద్దతు తెలుపుతుంటే, మరికొన్ని వ్యతిరేకిస్తు, పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నాయన్నారు. జమిలి ఎన్నికలపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. ఈ ప్రోగ్రాం లో జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు , వన్ నేషన్ వన్ ఎలక్షన్ జమ్మికుంట పట్టణ కన్వీనర్ ఆకుల రాజేందర్, కో కన్వీనర్ జీడిమల్లేష్ , జడల శ్రీనివాస్, కోరే రవీందర్, కేతు పెల్లి రమాదేవి , పోలింగ్ బూత్ అధ్యక్షులు, కుల సంఘ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా అమలు చేయాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**హుజూరాబాద్, మహా:** హాస్టల్లో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూ ప్రకారమే నాణ్యమైన పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. హుజురాబాద్ మండలం బోర్నపల్లిలో గల మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ పమేలా సత్పతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్లో వసతులను, సౌకర్యాలను పరిశీలించారు. వంటగది ని, సరుకుల స్టోరేజీ గదిని తనిఖీ చేశారు. వంట గదిలో శుభ్రత పాటించాలని, పరిశుభ్రత, నాణ్యతతో భోజనం తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నిర్దేశించిన కంపెనీలకు చెందిన స్టాక్ ను మాత్రమే వినియోగించాలని తెలిపారు.

భోజనం రుచి, నాణ్యతను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఏ సమయానికి ఏయే ఆహారం ఇస్తున్నారని విద్యార్థులను అడిగారు. కామన్ డైట్ మెనూ ద్వారా ప్రభుత్వం అన్ని రకాల పోషకాహారంతో కూడిన ఆహారాన్ని అందజేస్తున్నదని తెలిపారు. అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ పాఠశాలను పక్కా భవనంలోకి మార్చే విషయాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రిన్సిపల్ రాణి పాల్గొన్నారు.

# కన్నతల్లి కట్టుకున్న భార్య హత్యకు పాల్పడ్డారు

- హత్య చేసినట్లు ఒప్పకున్న మృతుడి భార్య తల్లి..కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలింపు





**రంగారెడ్డి జిల్లా, మహా:** పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, హనుమాన్ పూర్ గ్రామంలో గత రెండు రోజులకు క్రితం జరిగిన హత్యలో ఇద్దరు మహిళలను గురువారం రిమాండ్కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వికారాబాద్ జిల్లా, పెద్దేముల్ మండలం, హనుమాన్ పూర్ గ్రామంలో నివాసముంటున్న, బక్కని వెంకటేష్ అనే వ్యక్తి తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి తన తల్లి, అతని భార్యతో తరచూ వేధించేవాడని, ఇది భరించలేక మంగళవారం రాత్రి అతని తల్లి భార్య ఇనుపరాడ్లతో తలపై కొట్టి చంపడం జరిగిందని తెలిపారు. మృతుడి సోదరుడు శ్రీనివాసు చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టడంతో ఈ విషయాలు బయటకు వచ్చాయని పోలీసులు అన్నారు. మృతుడి లక్ష్మమ్మను, సవితని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, హత్య తామే చేసినట్లుగా ఒప్పుకోవడంతో రిమాండ్కు తరలించారు.

# ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన

## కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్



**కరీంనగర్, మహా:** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని రూరల్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని గురువారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ సందర్శించారు. డివిజన్ పరిధి అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో గల పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. అర్బన్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటి కప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటి కప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నందున, వాటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ హోల్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా మరియు పి.డి.ఎస్. బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోవడం, వంటి వాటిని గుర్తించి తగిన కేసులు నమోదు చేసి, వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ ఐపిఎస్ తో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ, ఎస్సీ వర్గాలకు కాంగ్రెస్ చారిత్రక న్యాయం



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోర్కూరు మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ అధ్యక్షులు, వంగాల సత్యనారాయణ గారి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చిత్రపటానికి పాలాభిషేకం మోత్కూర్ మున్సిపాలిటీ, యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42% రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని మోత్కూర్ మండల కాంగ్రెస్ నాయకులు హర్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు, పైళ్ల సోమిరెడ్డి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి, నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయ పరిరక్షణలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. బీసీ, ఎస్సీ వర్గాల పక్షాన అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం చారిత్రక ఘటన. దీని అమలు ద్వారా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగుతుంది. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వంగాల సత్యనారాయణ మాట్లాడుతూ, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం కట్టుబడి ఉంది. బీసీలకు 42% రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం సామాజిక న్యాయానికి గర్వకారణం. ఈ విజయాన్ని ప్రజలకు వివరించి, పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నూనేమంతల విమల వెంకటేశ్వర్లు గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు అబిశెట్టి అవిలిమల్లు, సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ తండా సత్తయ్య, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జయశ్రీ, టౌన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అన్నెపు పద్మ,మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు జినుకల కనకయ్య, బుష్పాక రమేష్, మాజీ కోఆప్షన్ మెంబర్ ఘనగాని నరసయ్య గౌడ్, మార్కెట్ డైరెక్టర్ సమిరుద్దీన్, టౌన్ కాంగ్రెస్ నాయకులు కారుపోతుల వెంకన్న గౌడ్, కేమెడీ సైదులు, మండల ఉపాధ్యక్షులు, పామునుగుల్ల రవి, దేవరపల్లి రంగా రెడ్డి, మెంట నగేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, ఎర్రసానిపల్లి సందీప్, ఎన్ ఎస్ యు ఐ, మండల అధ్యక్షులు, నిమ్మల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు, కోనతం నరేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, అవిశెట్టి కిరణ్, ఘనగాని అనిల్, చింతల విజయభాస్కర్ రెడ్డి, గొలుసుల దుర్గయ్య, గొలుసుల అవిలయ్య, ఆలకుంట్ల రాజు, ఎండి, జానీ,గంజి మంగమ్మ, తీగల వినోద్, ప్రవీణ్, జంగా నాగయ్య,కప్పే వెంకటేష్, దయ్యాల అవిలిమల్లు,జిట్టా నరేష్, నిమ్మల రమేష్, అన్నెపు మల్లేష్, బుషిపాక నరేష్,వంగరి రాములు, ఎండి, మునిర్, జిట్టా అంజయ్య,నల్ల రామనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు,

# వేసవిలో మంచినీటి సమస్య రావద్దు

## సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు



**కాటారం, మహా :** వేసవిలో నియోజక వర్గంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అధికారులు గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి నీటి సమస్యరాకుండా చూడాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.గురువారం కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాటారం సబ్ డివిజన్ పరిధిలోని అధికారులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని కాటారం, భూపాలపల్లి డివిజన్లులో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అధికారులు గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో 30 బోర్లు నిర్మానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని అవసరం ఉన్న గ్రామాలలో ఏర్పాటు చేయాలని తెలిపారు. కాటారం సబ్ డివిజన్ హెడ్ క్వార్టర్స్ లో మినీ స్టేడియం, చిల్డ్రన్ పార్కు నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలని తెలిపారు. నిర్మాణం పూర్తి చేసుకున్న గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రామాలలో సోలార్ పవర్ ద్వారా నీటి మోటార్ల ఏర్పాటుకు ప్రతి పాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సి.ఆర్.ఆర్ ద్వారా ఉట్ల పోచమ్మ , దామరకుంట నుండి మానేరుకువెళ్ళే రోడ్డు, ఒడు పులవంచ గ్రామాలలో నాలుగు రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని వాటి నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని స్పష్టం చేశారు. ఏ.సి.డి.పి నిధుల ద్వారా నిర్మాణంలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కాటరం సబ్ డివిజన్ కేంద్రంలో మంజూరు చేసిన కూరగాయల మార్కెట్, కమ్యూనిటీ హాలు నిర్మాణాలను టెండర్లను పిలిచి పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. కాటరం సబ్ డివిజన్ కు అంబులెన్సు, వైకుంఠ రథాలు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని వెంటనే ఏర్పాటు చేయాలని తెలిపారు. కాటరం సబ్ డివిజన్ కేంద్రం, మహదేవ్ పూర్ మండల కేంద్రాల్లో ఆర్.టి.సి బస్టాండ్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు పంపాలని ఆదేశించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని చెరువుల నిర్మాణం పనులు భూసేకరణ త్వరిత గతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు.